thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ముంబైపై సీఎస్కే విశ్వరూపం



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 35 | జగిత్యాల | శుక్రవారం | 24 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |




# ఆర్టీసీ సెగకు కేబినెట్ చెక్

**హైదరాబాద్, ఏప్రిల్ 23 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం పలు సంచలన నిర్ణయాలకు వేదికైంది. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తీర్చేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఉదారతను చాటుకున్నారు. తమ జీతాల నుంచి 50 శాతాన్ని కోత విధించుకుని ఆ నిధులను ఉద్యోగుల ప్రయోజనాల కోసం మళ్లించాలని కేబినెట్ ఏక్గ్రవంగా తీర్మానించింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

మిగతా 2 లో

**రంగంలోకి 'పంచ పాండవులు'**

ఉద్యోగుల బకాయిల కోసం మంత్రుల త్యాగం

జీతాల్లో 50 శాతం కోతకు నిర్ణయం!

నేడే నిర్ణయాత్మక చర్చలు!

ఆత్మహత్యలు వద్దని సీఎం విజ్ఞప్తి





రెండోరోజూ కొనసాగిన
## ఆర్టీసీ సమ్మె
ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు

- బలవంతంగా నడడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇద్దరు డ్రైవర్ల
## సూసైడ్ అటెంప్ట్
వరంగల్, నల్లగొండ జిల్లాల్లో కలకలం

2

# అసలు సిసలు భగీరథ ప్రయత్నం!

రవీంద్రభారతిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే యువతకు స్ఫూర్తి

మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు

వివరాలు 2లో..



## సుప్రీంకోర్టుకు కాళేశ్వరం

- హైకోర్టు తీర్పుపై అప్పీలుకు సర్కార్ సిద్ధం
- త్వరలోనే ఎస్ఎల్‌పీ దాఖలుకు కసరత్తు
- కేసీఆర్, హరీశ్ రావుకు ఊరటపై సవాల్

2





## ఎల్బీనగర్‌కు డబుల్ డెక్కర్ ధమాకా!

- 7.1 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమీక్ష

2

## శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

- మత విశ్వాసాలు రాజ్యాంగ నైతికతకు లోబడే ఉండాలి..
- 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం
- సోషల్ మీడియా సమాచారంపై సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు

4





## మేడ్ ఇన్ తెలంగాణ గ్లోబల్ బ్రాండ్!

ములుగులో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

2

## నేటి నుంచే వేసవి సెలవులు!



- జూన్ 11 వరకు విద్యాసంస్థలకు వేసవి విరామం
- జూన్ 12న తిరిగి తెరుచుకోనున్న పాఠశాలలు
- ఆర్‌టీసీ సమ్మెతో నిలిచిన పల్లె పయనాలు

3

## సీఎం రేవంత్ మాట తప్పారు!

- ఆర్‌టీసీ సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు
- కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఒక్కటే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



3



## బీజేపీదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

4

## తమిళనాడు, బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం



- బెంగాల్‌లో 89.93 శాతం..
- తమిళనాడులో 82.24 శాతం
- మే 4న తుది ఫలితాలు

4

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది.



## 11 మంది సజీవదహనం!

అదుపుతప్పిన ట్రక్కు.. ముక్కలైన వాహనాలు

ఎగిసిపడిన నిప్పురవ్వలు

4

చురకలు






## కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## అసలు సిసలు భగీరథ ప్రయత్నం!

### రవీంద్రభారతిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

### అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే యువతకు స్ఫూర్తి

### మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కాని మారుతీసగర తదితరులు హాజరై భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సగర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. కలియుగంలోనూ భగీరథుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నామని వివరించారు. శివుడి తలలో బంధీగా ఉన్న గంగమ్మను దివి నుంచి భువికి తెచ్చిన మహానుభావుడు భగీరథుడని కొనియాడారు. భగీరథుడి పట్టుదలే నేటి సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. బసవేశ్వరుడు 'కాయకమే కైలాసం' అని చెబితే.. అనుకున్న పని సాధించే వరకు ప్రయత్నం ఆపకూడదని భగీరథుడు నిరూపించారని మంత్రి గుర్తు చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. భగీరథుడిని దిక్సూచిగా మార్చుకుని యువత పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుడి జీవితం మనకు నేర్పుతుందన్నారు.

## మేడ్ ఇన్ తెలంగాణ గ్లోబల్ బ్రాండ్!

### ములుగులో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**గజ్వేల్, ఏప్రిల్ 23:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో 'ఆజాద్ – సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ ఇంధన సాంకేతిక సంస్థ 'బేకర్ హ్యూస్' కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లీన్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీని ఆయన ప్రారంభించారు. సుమారు 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక సాంకేతికతతో ఈ కేంద్రాన్ని నిర్మించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ బేకర్ హ్యూస్.. ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్, ఇండస్ట్రియల్ ఎనర్జీ టెక్నాలజీ, డిజిటల్ సొల్యూషన్స్ రంగాల్లో ప్రసిద్ధి చెందింది. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ఈ సంస్థ తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తునికి బొల్లారంలో తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో పారిశ్రామిక ఇంధన అవసరాలకు కావాల్సిన హై ప్రిసిషన్ ఉత్పత్తులను తయారు చేస్తారు. దీనివల్ల తెలంగాణ పారిశ్రామిక రంగంలో కొత్త పుంతలు తొక్కనుంది.

### యువతకు భారీగా ఉపాధి అవకాశాలు

ఈ కొత్త తయారీ కేంద్రం ద్వారా సుమారు 230 మంది నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి లభించనుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత ప్రపంచవ్యాప్తం అవుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ కేంద్రం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సంస్థలు తెలంగాణకు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## ఆర్టీసీ సెగకు కేబినెట్ చెక్

మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర కేబినెట్ భేటీ అనంతరం మంత్రుల బృందం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాలకుల బాధ్యతను, ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటిచెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్ళింది. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రూ. 8,000 కోట్ల బకాయిలను గాలికి వదిలేశారు. వారు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరగడం చూస్తుంటే బాధేస్తోంది. అందుకే ఒక కీలక నిర్ణయం తీసుకున్నాం. అవసరమైతే మా మంత్రులం, ఎమ్మెల్యేలం అందరం మా జీతాల్లో 50 శాతం కోత విధించుకుంటాం. ఆ డబ్బుతో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు తీరుస్తాం. 100 రోజుల్లోగా ఈ బకాయిలన్నీ చెల్లించాలని అధికారులను ఆదేశించాం" అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "ఆర్టీసీ కార్మికులకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా.. దయచేసి ఎవరూ ఆవేశంలో ప్రాణాలు తీసుకోవద్దు. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కావు. మీ సమస్యల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా సానుకూలంగా ఉన్నారు. అందుకే ఐదుగురు మంత్రుల కమిటీని వేశాం. రేపు (శుక్రవారం) డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో మేము చర్చలు జరుపుతాం. మీ డిమాండ్లపై మనసు విప్పి మాట్లాడదాం, పరిష్కారం వెతుకుదాం" అని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన దోపిడీని మేం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇప్పటికే దీనిపై విచారణ జరుగుతోంది. అవసరమైతే సీబీఐ విచారణ కోసం కేంద్రాన్ని కోరుతాం. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే. అలాగే గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం. రూ. 700 కోట్లతో అక్కడ అద్భుతమైన క్రీడా సౌకర్యాలు రాబోతున్నాయి"అని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిది. మీ హక్కులను కాపాడే బాధ్యత మాది. ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వండి. అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. అలాగే సహకార సంఘాల ఎన్నికలను త్వరలోనే నిర్వహిస్తాం. పారదర్శకమైన పాలన అందించడమే మా లక్ష్యం. ప్రభుత్వంపై నమ్మకం ఉంచండి" అని విజ్ఞప్తి చేశారు.

### ఆర్టీసీ సమ్మెపై సానుకూలత

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎవరూ ఆవేశానికి లోనై ప్రాణాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం దిశగా ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బృందం నేడు (శుక్రవారం) ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో చర్చలు జరపనుంది. చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకుందామని, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రులు కోరారు.

### ఉద్యోగుల బకాయిలకు చెక్

గత ప్రభుత్వం వదిలివెళ్లిన వేల కోట్ల రూపాయల ఉద్యోగ బకాయిలపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 8,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వచ్చే 100 రోజుల్లోగా పూర్తిగా చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### కాళేశ్వరంపై సీబీఐ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. న్యాయ నిపుణులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అలాగే, రాష్ట్రంలో సహకార సంఘాల ఎన్నికలను త్వరలోనే నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. పీఏసీఎస్ చైర్మన్లను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తామని ప్రకటించారు.

### గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధి

క్రీడా రంగానికి ఊతమిచ్చేలా గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి టాటా సంస్థ ముందుకు వచ్చినట్లు మంత్రులు వెల్లడించారు. సుమారు 76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియాన్ని రూ. 700 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలు, ఉద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

### ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు

### బలవంతంగా నడిపేందుకు యత్నాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగుతుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఇద్దరు డ్రైవర్ల సూసైడ్ అటెంప్ట్

### వరంగల్, నల్లగొండ జిల్లాల్లో కలకలం






ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్రంలో పలుచోట్ల ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడ డిపోలో డ్రైవర్ వెంకన్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సమ్మెపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ చర్యకు దిగినట్లు సమాచారం. అయితే వెంటనే అప్రమత్తమైన తోటి ఉద్యోగులు ఆయనను అడ్డుకుని పెద్ద ప్రమాదం తప్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఓఊఓ వైద్యులు శంకర్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిపై తాజా వివరాలు వెల్లడించారు. ఆయనకు 60 నుంచి 80శాతం వరకు కాలిన గాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను హైదరాబాద్‌కు తరలించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వాతావరణం నెలకొంది. దిలా ఉంటే, రాష్ట్రంలో ఖఅ కార్మికుల సమ్మె కారణంగా రెండో రోజు కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ఉద్యోగులు, దినసరి కూలీలు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి రావడంతో ప్రయాణికులు అధిక ఛార్జీల భారాన్ని మోస్తున్నారు.

## ఎల్బీనగర్‌కు డబుల్ డెక్కర్ ధమాకా!

- 7.1 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్
- 15 నిమిషాల్లోనే నగరం దాటేలా ప్రణాళిక
- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించ తలపెట్టిన 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి ప్రాజెక్టు పురోగతిని సుదీర్ఘంగా చర్చించారు. సీఎమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. మొత్తం 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున 200 కోట్లు ఇచ్చేందుకు సీఎమ్ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు. నాగపూర్ తర్వాత దేశంలోనే ఇది రెండో అతిపెద్ద ప్రాజెక్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని.. హైదరాబాద్–విజయవాడ మార్గంలో ప్రయాణించే వారు కేవలం 15 నిమిషాల్లోనే నగరాన్ని దాటవచ్చని వివరించారు. ఎన్ హెచ్ 65 మార్గంలో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్ పూర్తయితే స్థానికులు సర్వీస్ రోడ్ల ద్వారా సులభంగా రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి, పైన మెట్రో రైలు నిర్మాణం ఉండేలా సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించారు. నాణ్యతతో కూడిన పటిష్టమైన పిల్లర్లను నిర్మించాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు సమాంతరంగా సాగేలా ఒకే వర్క్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగిస్తే సమన్వయ లోపం ఉండదని అభిప్రాయపడ్డారు. అధికారులు తమ స్థాయిలో పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కారిడార్ పనులను తక్షణమే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేటి నుంచే వేసవి సెలవులు!

- జూన్ 11 వరకు విద్యాసంస్థలకు వేసవి విరామం
- జూన్ 12న తిరిగి తెరుచుకోనున్న పాఠశాలలు
- ఆర్‌టీసీ సమ్మెతో నిలిచిన పల్లె పయనాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు నేటి నుంచే వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారంతో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగియగా.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభమైంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు. కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియడంతో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించింది. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది నేటి నుంచే ప్రారంభమైంది. అయితే ఆర్‌టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. సమ్మె కారణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఊళ్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

# ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులదే!

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఆర్టీసీ కార్మికుల కు మద్దతు
- ప్రభుత్వం దిగిరాకుంటే సెక్రటేరియట్ ముట్టడి



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ఆర్‌టీసీ సమ్మెలో భాగంగా రెండో రోజు రాణిగంజ్ డిపో వద్ద కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ సాధనలో ఆర్‌టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని.. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి కూడా వారికే ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని, అందులో ఆర్‌టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ కృషితోనే తెలంగాణ సిద్ధించిందని.. ఆ విషయాన్ని ప్రభుత్వం మర్చిపోకూడదని సూచించారు. ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారడంతో అమలులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను నియమించడాన్ని తలసాని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్‌టీసీ బస్సులు నడిపే అనుభవజ్ఞులైన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సులు నడపడం రాదా అని ప్రశ్నించారు. ఇది సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్ర అని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరిస్తే కార్మికులు సమ్మె ఎందుకు చేస్తారని నిలదీశారు. సమ్మె చేస్తున్న వారిని ఎండీ భయపెట్టడం సరికాదని.. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని పిలుపునిచ్చారు. కేబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆర్‌టీసీ జేఏసీ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలవాలని తలసాని డిమాండ్ చేశారు. తూతూ మంత్రంగా కాకుండా 29 డిమాండ్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆ డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల వెనుక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మొత్తం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. తాండూరులో కార్మికుల టెంట్లకు పోలీసులు అడ్డుపడటంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు అని తలసాని అన్నారు. మేధా పర్వతం లాంటి కేసీఆర్ పై ఉమ్మేస్తే అది కాంగ్రెస్ నాయకులపైనే పడిందని ఎద్దేవా చేశారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తూ రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించిన ప్రాజెక్టును అవినీతిమయం అనడం సరికాదన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే లక్ష కోట్ల అవినీతి అంటూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కక్షసాధింపులు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కే కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

# నకిలీ ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేల ఫైన్!




**హంగార్గా గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు**


**పిల్లల ఆరోగ్యం కోసం గ్రామస్తుల కీలక నిర్ణయం**

**నిజామాబాద్, ఏప్రిల్ 23:** తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ విక్రయిస్తే భారీ జరిమానా విధిస్తామని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగార్గా గ్రామస్తులు, సర్పంచ్ హెచ్చరించారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగులు, రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని తెలిపారు. వీటిని తినడం వల్ల చిన్న పిల్లలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే గ్రామంలోకి ఇలాంటి వాటిని అనుమతించబోమని.. ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపితే రూ.5 వేల జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఐస్‌క్రీమ్‌తో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్లు, జంక్ ఫుడ్స్ విక్రయాలపైనా నిషేధం విధిస్తున్నట్లు గ్రామ కమిటీ ప్రకటించింది. అనంతరం శివాజీ చౌక్ వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి, గ్రామ కార్యదర్శి గంగారాం, భజరాం, గోవింద్, ఉమ్మర్, జీవన్ పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు

**ఈ-కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా, రేషన్ కార్డు వినియోగదారులందరికీ ఈ-కేవైసీ' ప్రక్రియను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గతంలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, అనర్హులను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. చాలా మంది లబ్ధిదారులు తమ కార్డులలో వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల రేషన్ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే లక్షలాది కార్డులు నిబంధనలు పాటించని కారణంగా రద్దు చేశారు. కాబట్టి, ప్రభుత్వం అందించే ఉచిత లేదా రాయితీ బియ్యం, ఇతర సరుకులను నిరంతరాయంగా పొందాలంటే.. ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అత్యవసరం. రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తి బ్రతికే ఉన్నారా లేదా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల కార్డులు ఉన్నాయా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయోమెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ-కేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. వి వా ం ు ప్రస్తుతం మీ ఊ రి లో లేకపోయినా, 'వన్ నేషన్ ? వన్ రేషన్ కార్డ్' పథకం ద్వారా మీరు ఉన్న చోటే దగ్గరలోని రేషన్ షాపులో కేవైసీ పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికీ చాలా మంది రేషన్ కార్డుదారులు తమ ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదని.. వారు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. దీంతో పాటు.. వరుసగా మూడు నెలల కంటే ఎక్కువ నెలలు ఆ రేషన్ కార్డు ద్వారా ఎలాంటి రేషన్ తీసుకోకపోతే.. ఆ కార్డులు కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా రద్దైన కార్డులు కూడా దేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి.






# రేవంత్ మాట తప్పారు!

**ఆర్‌టీసీ సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు**

**కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఒక్కటే**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్‌టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆర్‌టీసీ కార్మికుల సమ్మెపై ఆయన గురువారం తీవ్రంగా స్పందించారు. అసలు సమస్యలను పక్కన పెట్టి కేబినెట్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రామచందర్ రావు మండిపడ్డారు. గతంలో పీఆర్‌సీ విషయంలో కేసీఆర్ మాట ఇచ్చి తప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్‌టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని.. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు కార్మికులకు అండగా ఉంటారని రామచందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే బీజేపీ తరఫున ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటామని హెచ్చరించారు. శుక్రవారమే ప్రభుత్వం కార్మికులను చర్చలకు పిలవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# రాహుల్‌తో పీసీసీ చీఫ్ భేటీ

**రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ**

**పార్టీ సంస్థాగత నిర్మాణపైనా చర్చ**

**నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్లేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. 'బీసీ గణన చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు, కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావాలి' అని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తీపి కబురు అందిస్తూ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను మే నెలలోగా భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. రాహుల్ గాంధీతో భేటీ అత్యంత సంతృప్తికరంగా సాగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి రాహుల్ కొన్ని సూచనలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే తమ తక్షణ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్ముతున్న ముఠాను పట్టుకున్నారు. సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

చురకలు





సంపాదకీయం

# ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు నీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభు త్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమ బద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యాని ఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యో గుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరి చారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# తమిళనాడు, బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం




- బెంగాల్‌లో 89.93 శాతం..
- తమిళనాడులో 82.24 శాతం ఓటింగ్
- మే 4న తుది ఫలితాలు

**చెన్నై/కోల్‌కతా, ఏప్రిల్23:** దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. అంచనాలను మించి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో అటు దక్షిణాదిలోనూ, ఇటు తూర్పు భారత్‌లోనూ ఓట్ల వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు పోలింగ్ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించగా, రాత్రి పొద్దుపోయే వరకు కూడా పలు కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ భారీ పోలింగ్ శాతం ఎవరికి పట్టం కట్టబోతోందన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ సరళిని గమనిస్తే ఓటరు నాడి స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాలకు గానూ, తొలి విడతలో 152 సీట్లకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటలకే రికార్డు స్థాయిలో 89.93 శాతం పోలింగ్ నమోదైంది. బెంగాల్ రాజకీయ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా సామాన్యులతో కలిసి క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం విశేషం. మరోవైపు తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. అక్కడ కూడా ఓటర్ల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 82.24 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. చెన్నై నుంచి కన్యాకుమారి వరకు ఓటర్లు భారీగా తరలివచ్చి ప్రజాస్వామ్య పండుగలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రక్రియను సజావుగా పూర్తి చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4, 2026 (సోమవారం)న వెలువడనుంది.

# బెంగాల్‌ల్లో బీజేపీదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**కోల్‌కతా, ఏప్రిల్ 23:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చ్రితీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# మీర్జాపూర్‌లో ఘోర ప్రమాదం: 11 మంది సజీవదహనం!

అదుపుతప్పిన ట్రక్కు.. ముక్కలైన వాహనాలు

ఎగిసిపడిన నిప్పురవ్వలు

**లక్నో, ఏప్రిల్ 23:** ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



# శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

- జస్టిస్ నాగరత్న కీలక వ్యాఖ్యలు!
- మత విశ్వాసాలు రాజ్యాంగ నైతికతకు లోబడే ఉండాలి..
- 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం
- సోషల్ మీడియా సమాచారంపై సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్23:** దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపుతున్న శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో గురువారం కీలక విచారణ జరిగింది. తొమ్మిది మంది సభ్యుల సుదీర్ఘ ధర్మాసనం ముందు వాడివేడి వాదనలు కొనసాగుతుండగా, న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆధునిక కాలంలో సమాచార వ్యవస్థ ఏ విధంగా తప్పుదోవ పట్టిస్తోందో వివరిస్తూ ఆమె వేసిన 'వాట్సాప్ యూనివర్సిటీ' సెటైర్లు కోర్టు హాల్లో నవ్వులు పూయించడమే కాకుండా, ఆలోచింపజేశాయి. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. జ్ఞానం ఏ మూల నుంచి వచ్చినా, ఏ విశ్వవిద్యాలయం నుంచి వచ్చినా దానిని ఆహ్వానించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లను ఉటంకించారు. దీనిపై జస్టిస్ నాగరత్న వెంటనే స్పందిస్తూ.. "ఏ విశ్వవిద్యాలయం నుంచి వచ్చినా పరవాలేదు కానీ, వాట్సాప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం కాదు" అంటూ చమత్కరించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రబలుతున్న తప్పుడు సమాచారాన్ని కోర్టులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వాదనల క్రమంలో మతపరమైన ప్రాథమిక హక్కుల అంశం తెరపైకి రాగా, సామాజిక సంస్కరణల పేరుతో ఈ హక్కులను కాలరాయలేమని న్యాయవాది కౌల్ వాదించారు. రాజ్యాంగ నైతికత అనేది ఒక అస్పష్టమైన పదమని, దానితో మత విశ్వాసాలను కొలవలేమని దావూదీ బోహ్రా వర్గం తరపు న్యాయవాది అభిప్రాయపడ్డారు. అయితే, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మతపరమైన హక్కులు అనేవి ఎప్పుడూ వ్యక్తిగత స్వేచ్ఛకు మాత్రమే పరిమితం కావని, అవి దేశ నైతికత, ప్రజారోగ్యం మరియు శాంతిభద్రతలకు లోబడే ఉండాలని జస్టిస్ నాగరత్న గుర్తుచేశారు. రాజ్యాంగ పరిధిని దాటి మత విశ్వాసాలు ఉండవనే సంకేతాన్ని ఈ విచారణ ద్వారా సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ

**■ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ ఏప్రిల్23 :** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్డీఓలు, తహసీల్దార్ లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 78 శాతం పురోగతి నమోదైందని, దీన్ని త్వరితగతిన 100 శాతానికి చేర్చాలని సూచించారు. అన్‌మ్యాప్డ్ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా వృద్ధులు, మారిన ఓటర్లు (ఒష్ట్రఅట్వఎ జశీవతీం), మరణించిన వారి వివరాలను సరైన విధంగా సవరణ చేయాలన్నారు. కొత్తగా ఓటర్లను చేర్చడం, తప్పుగా నమోదైన వివరాలను సరిచేయడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బీఎల్వోలు తమ పరిధిలో ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, పేర్లలో ఉన్న తప్పులను సరి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న డేటాను సమగ్రంగా సమీక్షించాలన్నారు. పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. డేటా ఖచ్చితత్వం కోసం పుట్టిన తేదీ, వయసు వంటి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, పునరావృత (ఎబజూశ్రీఅఛ్ఞవ) పేర్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి, జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై భారత ఎన్నికల సంఘం ఇచ్చిన నియమనిబధనలను తప్పకుండా పాటించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లను నిర్దిష్ట సమూహాలుగా వర్గీకరించాలని, మరణించిన, శాశ్వతంగా తరలి వెళ్లిన ఓటర్లను ఫారం-7 తొలగింపు కింద తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వార్డులలో, మున్సిపల్ కార్యాలయాలు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టిఏ కార్యాలయాలు, కలెక్టరేట్ సేవా కేంద్రాలు, కళాశాలల్లో ప్రత్యేక మ్యాపింగ్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వర్గీకరణకు ముందు తాళం వేసిన ఇళ్లను మూడు సార్లు తప్పనిసరిగా సందర్శించాలన్నారు. నిర్దిష్ట సమయ స్లాట్‌లతో మ్యాపింగ్ కార్యకలాపాల కోసం గ్రామ సభలను ఉపయోగించుకోవాలని, గిరిజన నివాస ప్రాంతాలు, తండాల్లో రోల్-వాకింగ్ పద్ధతిని అమలు చేయాలన్నారు. ప్రజా సంబంధాల ధృవీకరణ కోసం అంగన్‌వాడీ, పాఠశాల రికార్డులను ఉపయోగించాలని, వివాహిత మహిళా ఓటర్లకు సహాయం చేయడానికి స్వయం సహాయక బృందాలను సమీకరించాలన్నారు. డేటా నిర్వహణ, పర్యవేక్షణ కోసం (కలెక్టరేట్)లో రోజువారీ డాష్ బోర్డ్‌ను నిర్వహించాలని, బీఎల్ఓ (దీూ)ల వారీగా మ్యాప్ చేయని ఓటర్ల జాబితాలను జారీ చేయాలన్నారు. ప్రతి షెడ్యూల్డ్ గ్రామ సభలో 20 నిమిషాల ప్రత్యేక మ్యాపింగ్ సమయాన్ని కేటాయించాలని, ఆ గ్రామానికి చెందిన 2002 ఓటర్ల జాబితాను ముద్రించి, ప్రజలు చదువుకోవడానికి వీలుగా నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. తండాలు, గిరిజన నివాస ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సేకరణలో భాగంగా "రోల్-వాకింగ్" చేసి, బిఎల్ఓ, అంగన్‌వాడీ కార్యకర్త (లేదా) ఆశా కార్యకర్తతో కలిసి, ఆ పోలింగ్ ప్రాంతానికి సంబంధించిన 2002 ఓటర్ల జాబితా ముద్రిత ప్రతిని పట్టుకొని, "మ్యాపింగ్ రిజిస్టర్" ద్వారా మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏప్రిల్-మే నెలల్లో జరిగే తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను మ్యాపింగ్ టచ్ పాయింట్‌లుగా ఉపయోగించాలని, వారి తల్లిదండ్రుల ద్వారా 18-21 సంవత్సరాల వయసు గల మొదటిసారి ఓటు వేసే ఓటరు వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవాలని, ప్రతి ఇంటికి సంబంధించిన తల్లిదండ్రులు-పిల్లల సంబంధాలను కలిగి ఉండే అంగన్‌వాడీ రిజిస్టర్లను, తదుపరి బీఎల్ఓ సందర్శనకు ముందు సూపర్‌వైజర్ మ్యాప్ చేయని జాబితాలతో సరిపోల్చి చూడాలన్నారు. ప్రతి మ్యాపింగ్ నమోదుతో పాటు, ఓటరు సంతకం చేసిన సహాయక సంబంధ ప్రకటన జత చేయాలని, దీనిని రుజువుగా బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, అన్ని మండలాల తహసీల్దార్లు, తొర్రూరు, సిద్దిపేట తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కుట్రల కోటలు బద్దలు

**■ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**




**ఖమ్మం, ఏప్రిల్ 23 :** కాంగ్రెస్ కుట్రల కోటలు బద్దలు అయ్యాయనీ , తెలంగాణ సాధకుడు, అపర భగీరథుడు కేసీఆర్ ని రాజకీయంగా ఎదుర్కోలేక, అబద్ధపు విచారణ కమిషన్లతో బద్నాం చేయాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి న్యాయస్థానం సాక్షిగా గట్టి చెంపదెబ్బ తగిలిందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు..తెలంగాణ అంటేనే ఒక పోరాటం. ఆంధ్రా పాలకుల అణచివేతలో, ఆత్మగౌరవం కోల్పోయి బతుకుతున్న తెలంగాణ సమాజానికి 'జై తెలంగాణ' అనే నినాదంతో ప్రాణం పోసిన గొప్ప నాయకుడు కేసీఆర్ . ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లో ఉద్యమ సెగను రగిలించి, ఢిల్లీ పీఠాన్ని కదిలించి స్వరాష్ట్రాన్ని సాధించిన చరిత్ర ఆయనది. కేసీఆర్ ఒక వ్యక్తి కాదు.. ఆయన తెలంగాణ పునర్నిర్మాణానికి పునాది అని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంను కేవలం మూడేళ్లలో పూర్తి చేసి, పచ్చని పంటలతో తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చింది బిఆర్ఎస్ ప్రభుత్వం. మేడిగడ్డలో పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే, దానిని సాకుగా చూపి 'కూలేశ్వరం' అంటూ విషప్రచారం చేశారు. నీటిని నిల్వ చేసే తెలివి లేక, మేడిగడ్డ గేట్లు ఎత్తి నీటిని సముద్రం పాలు చేసి, ఇవాళ నీటి కరువు తెచ్చిన ద్రోహి రేవంత్ రెడ్డి. ఇప్పుడు నిపుణుల కమిటీలే చెబుతున్నాయి.. కాళేశ్వరం లేకపోతే తెలంగాణకు గతే లేదని ... ఇది దూరదృష్టి అంటే అని పేర్కొన్నాడుజస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అయినా, జస్టిస్ ఘోష్ కమిషన్ అయినా.. కేవలం కేసీఆర్ ని, హరీష్ రావు ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 1952 విచారణ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం కనీసం నోటీసులు ఇవ్వకుండా, నిందితుల పక్షం వినకుండా ఏకపక్షంగా నివేదికలు సిద్ధం చేయడం ఏంటని న్యాయస్థానం ప్రశ్నించింది. రాజకీయ లబ్ధి కోసం మాజీ న్యాయమూర్తులను సైతం పావులుగా వాడుకుంటున్న రేవంత్ రెడ్డి తీరుకు హైకోర్టు తీర్పు ఒక గుణపాఠం." మని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు ఒ ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, జిల్లా మైనార్టీ నాయకులను తాజుద్దీన్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, ఈదుల రాజేష్, బెల్లంకొండ గోపి, నాయకులు మహమ్మద్ రఫీ, కృష్ణ ప్రసాద్, పోలిపాంగు వెంకట్, మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ అద్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




**- హన్మకొండ ఏప్రిల్23 :** : హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి చాహత్ బాజపాయి ఆదేశాలమేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న (గురు వారం) రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు శ్రీ యన్. రవి గారు ప్రారంభించారు. అదనపు కలెక్టర్ యన్. రవి గారు మాట్లాడుతూ, "మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. నా పరిమితుల్లో నేనున్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, "పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం" అని తెలిపారు. తర్వాత అదనపు కలెక్టర్ శ్రీ యన్. రవి గారిని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్డ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్: డా. పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి: బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్..



**ఖమ్మం, ఏప్రిల్ 23 :** టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో నగరంలోని బైపాస్ రోడ్డులో గల ఆర్టీసీ నూతన బస్టాండ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. స్థానిక పరిస్థితులపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. బందోబస్త్ లో వున్న పోలీస్, అధికారులు సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ జేఏసీ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రైవేట్ డ్రైవర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో పోలీస్ రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిదంగా ప్రజా రవాణా వ్యవస్థకు (బస్సులు) ప్రభుత్వ అస్తులకు నష్టం కలిగించడం, ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్ ఏసీపీ రమణమూర్తి కి ఆదేశించారు.

# కలెక్టరేట్ ప్రాంగణంలో అనధికారిక వాహనాల తొలగింపుపై హెచ్చరిక




**జనగామ ఏప్రిల్23 :** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, జనగామ కలెక్టరేట్ ప్రాంగణంలో అనధికారికంగా పార్క్ చేసిన వాహనాలను గుర్తించినట్లు కలెక్టరేట్ హెచ్ - సూపరింటెండెంట్ సీహెచ్. రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ భద్రత, క్రమశిక్షణ, నిర్వహణను దృష్టిలో ఉంచుకొని, ఈ వాహనాలను 24.04.2026 (శుక్రవారం) సాయంత్రం లోపు తప్పనిసరిగా తొలగించాల్సి ఉందని సూచించారు. అనధికారికంగా నిలిపిన వాహనాల జాబితా సిద్ధం చేయడం జరిగిందని, సంబంధిత వాహన యజమానులు తమ వాహనాలను వెంటనే తరలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికీ సూచించిన గడువు లోపు వాహనాలు తొలగించని పక్షంలో, 25.04.2026 (శనివారం) నాడు క్రేన్లు, టోయింగ్ యంత్రాల సహాయంతో ఆ వాహనాలను తొలగించి, ఐడీఓసీ ప్రాంగణం వెలుపల ఉంచడం జరుగుతుందని హెచ్చరించారు. అందువల్ల, వాహన యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, వెంటనే స్పందించి తమ వాహనాలను తొలగించుకోవాలని కోరారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**● సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి**

**● జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ ఏప్రిల్23 :** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా (Simple Sale Deeds) సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. సాదాబైనామా కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ పత్రాలు, తదితర వివరాలను ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సమాచారం అందించి, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ స్థాయిలో తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు సమస్యాత్మక కేసులను జిల్లా స్థాయికి పంపించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేయడం, వారి హక్కులను రక్షించడం, భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో జనగణన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన జి హెచ్ ఎం సి కమిషనర్



**హైదరాబాద్ ఏప్రిల్,23 :** హైదరాబాద్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజి లో ఏర్పాటు చేసిన జనగణన శిక్షణ కేంద్రాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ సర్కిల్–36 పరిధిలో జరుగుతున్న శిక్షణ ఏర్పాట్లు, సదు-పాయాలు మరియు మొత్తం సిద్ధతను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, శిక్షణార్థులతో మాట్లాడిన కమిషనర్, జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం, సమన్వయం, సమయపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే అన్ని అవసరమైన వనరులు, సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కు దరఖాస్తులు ఆహ్వానం

**మహబూబాబాద్, ఏప్రిల్.23 :** మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన విద్యార్థుల యొక్క తల్లి దండ్రులకు తెలియజేయునది ఏమనగా, సంచాలకులు, గిరిజన సంక్షేమశాఖ తెలంగాణ ప్రభుత్వం వారు 2026–27 విద్యాసంవత్సరమునకు గాను టెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం క్రింద 3వ, 5వ, మరియు 8వ తరగతి యందు ప్రవేశమునకు ఉత్తర్వులు జారి చేసినారు కావున, జిల్లాలోని గిరిజనులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరని ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఎ ఏటూరునాగారం నేడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి విద్యార్థిని తల్లి తండ్రుల సంవత్సర ఆదాయం రూరల్ వారికి రూ. 1,50,000/- అర్బన్ వారికి రూ. 2,00,000/- లోపు ఉండవలెనని విద్యార్థులకు లాటరీ పద్ధతిన డ్రా తీయబడునని ధరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యలయం, ×ఖజా కార్యాలయము, మహబూబాబాద్ జిల్లా నందు తేది: 23.04.2026 నుండి చివరి తేది: 29.04.2026 సాయంత్రం 5.00 లోపు దరఖాస్తులు తీసుకొని పూర్తి చేసిన అప్లికేషన్ లు అదే ఆఫీసు లో తేది 07.05.2026 సాయంత్రం 5.00 లోపు సమర్పించ వలేనని అట్టి దరఖాస్తులను పరిశీలించి డ్రా తీయబడునని మొత్తం సీట్లు (122) లో 3వ తరగతికి 50%, 5వ తరగతికి 25%, 8వ తరగతికి 25%, చొప్పున కేటాయించబడునని మొత్తం సీట్లలో 33% బాలికలకు కేటాయించబడునని ఒక కుటుంబంనుండి ఒక్కరు మాత్రమే ఈ స్కీం క్రింద అర్హులని బాలికలకు ఈ నిబంధన వర్తించదని అన్నారు.

ఇందుకు గాను తప్పనిసరిగా సంబంధిత తాసిల్దారు చే మీసేవ ద్వారా కులము, నివాస ధ్రువీకరణ పత్రము మరియు ఆదాయం ధ్రువీకరణ పత్రము తేది 01 .04.2026 తరువాత మీసేవ ద్వారా తీసుకున్నవి అవసరమని, ప్రస్తుతము చదు వుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్. ఆధార్ కార్డ్ జతచేయాలని అన్నారు.

## వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఎస్ఐల సస్పెన్షన్

**వరంగల్ ఏప్రిల్23:** నర్సంపేట పోలీస్ స్టేషన్ ఎస్. ఐ రవి కుమార్ తో పాటు, ప్రస్తుతం సి.ఏ.ఆర్ విభాగంలో అటాచ్డ్ లో ఉన్న ప్రవీణ్ కుమార్ పై వచ్చిన ఆరోపణపై సమగ్ర విచారణ జరిపి వచ్చిన ఆరోపణను నిర్ధారణ కావడంతో ఇరువురి ఎస్సైలను సస్పెన్షన్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ గత రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

## 'వాట్సాప్ యూనివర్సిటీ' సమాచారం ఆమోదం కాదు: సుప్రీంకోర్టు

**న్యూ ఢిల్లీ ఏప్రిల్23 :** దేశసుప్రీంకోర్టు ఏప్రిల్ 23న కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రముఖ రచయితలు, ఆలోచనాపరుల అభిప్రాయాలను గౌరవిస్తున్నప్పటికీ, "వాట్సాప్ యూనివర్సిటీ" నుంచి వచ్చే సమాచారాన్ని కోర్టు ఆమోదించదని స్పష్టం చేసింది. మహిళలపై మతపరమైన ప్రదేశాల్లో వివక్ష, ముఖ్యంగా శబరిమల టెంపుల్ ప్రవేశంపై దాఖలైన పిటిషన్లపై తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ తో పాటు న్యాయమూర్తులు బి వి రాజారత్న, ఏం.ఏం సుందరేశ అహసనుద్దీన్ అమానుల్లా తదితరులు పాల్గొన్నారు. విచారణలో, నీరజ్ కిషన్ కౌల్ శశి థరూర్ రాసిన వ్యాసాన్ని ప్రస్తావించగా, ప్రధాన న్యాయమూర్తి "వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తిగతంగానే ఉంటాయి" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగరత్న "వాట్సాప్ యూనివర్సిటీ మాత్రం కాదు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

అదే సమయంలో, మతాచారాలలో ఏది 'అత్యవసరం', ఏది 'కాదు' అనే విషయాన్ని నిర్వచించడం కోర్టుకు చాలా క్లిష్టమని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2018లో సుప్రీంకోర్టు ఐదు మంది న్యాయమూర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పులో, 10 నుంచి 50 సంవత్సరాల మహిళలకు శబరి మల టెంపుల్ లో ప్రవేశాన్ని నిరోధించే ఆచారం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్ నగర్ ఏప్రిల్23 :** మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన బాల బాలికల నుండి 2026 – 27 విద్యా సం. నకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద 3వ, 5వ, 8వ తరగతులలో ప్రవేశముల కొరకు గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రూ నాయక్ తెలిపారు జిల్లాలో ఈ పథకము క్రింద మొత్తము (35) సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు మే 7 వ తేదీ లోగాజిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూము నంబర్.123, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయముల సముదాయము, పాలకొండ, మహబూబ్ నగర్ నందు పూర్తిచేసిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు ఏప్రిల్ 22 నుండి దరఖాస్తు లను ఉచితము గా పొందవచ్చునని యం. ఛత్రు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, మహబూబ్ నగర్ జిల్లా గారు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులను మే 14 నజిల్లా కలెక్టర్ కార్యాలయం, మహబూబ్ నగర్ లో లాటరీ పద్ధతి ద్వారా (35) గురి నిఎంపిక చేయడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకొను బాలబాలికల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1,50,000 గ్రామీణ ప్రాంతం మరియు 2,00,000 పట్టణ ప్రాంతం వారికి ఉండవలెను. కుల, నివాస, ఆదాయ, ధృవీకరణ పత్రములు తహసీల్దార్ / మీ సేవ ద్వారా పొందిన వాటిని జిరాక్సు ప్రతులను 2 పాస్ పోర్ట్ ఫోటోస్ మరియు ఆధార్ కార్డులను దరఖాస్తునకు జతపరచి సమర్పించాలనిఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు

# ఈ వెస్ట్ నిర్వహణ పైన జి హెచ్ ఎం సి ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్ ఏప్రిల్23 :** హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వెస్ట్) నిర్వహణకు సంబంధించి Greater Hyderabad Municipal Corpo ration (జిహెచ్ఎంసీ) కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించకపోతే అవి మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హానికరం. అందువల్ల భారత ప్రభుత్వం ఈ–వెస్ట్‌ను ప్రత్యేక వ్యర్థంగా గుర్తించి, అనుమతించిన సంస్థల ద్వారానే నిర్వహించాలనే నిబంధనలు అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, జిహెచ్ఎంసీ జనవరి 2026 నుంచి ఈ–వెస్ట్ సేకరణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. అయితే దీర్ఘకాలిక పరిష్కారం కోసం స్వయం సమర్థ ఈ–వెస్ట్ నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఈ క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త విధానంలో మూడు ప్రధాన సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

1. డ్రాప్ బాక్సులు

నగరంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ దుకాణాల్లో 30 డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేశారు. వీటిలో

Big C Mobiles, BNew Mobiles, Happi Mobiles, LOT Mobiles, Sangeetha Mobiles, Select Mobiles, Touch Mobiles వంటి సంస్థలు భాగస్వామ్యం అయ్యాయి. ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా ఈ కేంద్రాల సమాచారం తెలుసుకుని, తమ ఈ–వెస్ట్‌ను అందజేయవచ్చు.

2. ఇంటి వద్ద సేకరణ

హైదరాబాద్‌కు చెందిన ఈ–వెస్ట్ రీసైక్లింగ్ సంస్థలతో జిహెచ్ఎంసీ భాగస్వామ్యం ఏర్పరచుకుంది. ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా అభ్యర్థన పంపితే, సంస్థలు ఇంటి వద్దకే వచ్చి ఈ–వెస్ట్ సేకరిస్తాయి. ఇందులోEarth Sense Recycle, Recytronics, Pure Earth, Z Enviro, Green Enviro




సంస్థలు పాల్గొంటున్నాయి.

3. అవగాహన కార్యక్రమాలు

వివిధ వార్డుల్లో ఈ–వెస్ట్ ప్రభావాలు, సరైన నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో సేకరించిన వ్యర్థాలను అనుమతించిన రీసైక్లర్ల ద్వారా నిబంధనల ప్రకారం నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ–వెస్ట్‌ను సమర్పించిన పౌరులకు ప్రశంసాపత్రం మరియు రివార్డ్ పాయింట్లు అందిస్తారు. ఈ పాయింట్లను ౹ాష్ట్రఅశ్రీజుఖుతీఖుఎఖుఎ వంటి స్వయం సహాయక సంఘాల్లో వినియోగించుకోవచ్చు.

ఈ చర్యల ద్వారా మూలస్థాయిలో వ్యర్థాల వర్గీకరణ, ప్రజల భాగస్వామ్యం, వ్యర్థాల ట్రాకింగ్ మెరుగుపడి, డంపింగ్ యార్డులకు వెళ్లే వ్యర్థాల పరిమాణం తగ్గుతుంది. జిహెచ్ఎంసీ కమిషనర్ ఈ ఈ–వెస్ట్ ఎకోసిస్టమ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలోని ఎలక్ట్రానిక్ దుకాణాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీసైక్లింగ్ సంస్థలు మరియు జిహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాండ్లు, వాలంటీర్లు మరియు ఆసక్తి గల సంస్థలు పాల్గొని తమ సూచనలు అందించాలని జిహెచ్ఎంసీ ఆహ్వానిస్తోంది.

# వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- హుజుర్ నగర్ ఏరియా ఆసుపత్రికి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు
- డాక్టర్ల గైర్హాజరు పట్ల కలెక్టర్ ఆగ్రహం




**హుజూర్ నగర్ ఏప్రిల్23 :** ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ (ప్రాంతీయ వైద్యశాల) ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బాంక్ కేంద్రలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలనిరోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరెండేంట్ ని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని. సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డ్ పొందాలని ఆకాక్షించారు. మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టి హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరెండేంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 100% పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- పోటీ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయుల పై ఉంది
- రోజుకు ఒక గంట ఇంట్లో చదవడం తప్పనిసరి -- తల్లిదండ్రుల బాధ్యత
- ఎల్కలపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



**పెద్దపల్లి, ఏప్రిల్ - 23 :** 100% పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్–టీచర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి 100% అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని, దేశ, రాష్ట్ర స్థాయిలో ఎక్కడైనా పోటీలో ముందుండేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో అవార్డు లభించిన నేపథ్యంలో ఉపాధ్యాయులపై బాధ్యతలు మరింత పెరిగాయని, విద్యార్థులు బాగా చదువుతున్నారని, గ్రామస్తులు కూడా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ఇదే ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల చదువు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి ప్రతిభను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలు పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తర్వాత చదవడం, రాయడం విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోజుకు కనీసం ఒక గంట ఇంట్లో చదివేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, అందరూ కలిసి పని చేస్తే పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుడిపల్లి శ్రీనివాస్ (ఎన్ఆర్ఐ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్) రూ. 20,000 విలువైన సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ శారద, కవిత, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన శ్రీ చైత్ర రెడ్డి



**పెద్దముల్ మండలం, ఏప్రిల్,23 :** తె లంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ జట్టుకు శ్రీ చైత్ర రెడ్డి ఎంపికయ్యారు. పెద్దేముల్ మండలం గిర్మా పూర్ గ్రామ రైతు పటేల్ రాంరెడ్డి కూతురు శ్రీ చైతన్య రెడ్డి తాండూర్ లోని మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9 తరగతి చదువుతూ జనని క్రికెట్ అకాడమీలో గత మూడు సంవత్సరాలుగా శిక్షణ పొందుతుంది. ఈ నేపథ్య ంలో గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ అండర్ 17 క్రికెట్ పోటీలకు వికారాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ, రంగారెడ్డి జిల్లా జట్టులో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీలో ప్రతిభను కనబరిచి స్థానం సంపాదించింది. అనంతరం ఈనెల 19 నుండి 22 వరకు రంగారెడ్డి జిల్లా గుర్రం గూడా లోని జివిఎన్ఆర్ గ్రౌండ్స్ లో జరిగిన ఎస్ జీ ఎఫ్ అండర్ 17 బాలికల క్రికెట్ తరఫున ఆడింది. సెమీఫైనల్ లో రంగారెడ్డి జిల్లా జట్టు వరంగల్ పై విజయం సాధించడంలో శ్రీ చైతన్య రెడ్డి కీలకపాత్ర పోషించింది. అలాగే ఫైనల్ లో రంగారెడ్డి జట్టు హైదరాబాద్ జట్టు పై ఘన విజయం సాధించడంలో శ్రీ చైత్ర రెడ్డి ఓపెనర్ బ్యాట్స్మెన్ గానే కాకుండా పీక్ ఓవర్స్ లో ఆఫ్ స్పిన్ తో రాణించి తన ప్రతిభను చాటింది. ఈ నేపథ్యంలో ఆల్ రౌండర్ గా మంచి ప్రదర్శనతో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీల కు సిద్ధమైన రాష్ట్ర అండర్ 17 క్రికెట్ జట్టుకు శ్రీ చైతన్య రెడ్డి ఎంపికైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిఈఓ సుసింధర్ రావు, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ రామచంద్రుడు, రాష్ట్ర పీఈటి సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రవికుమార్ ,సాబెర్ తదితరులు గెలిచిన జిల్లా జట్టును అభినందించారు. సెమీఫైనల్ ఫైనల్ లో జట్టులో కీలక పాత్ర పోషించిన శ్రీ చైత్ర రెడ్డిని వారు అభినందించారు. రాష్ట్ర జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ చైతన్య రెడ్డి జాతీయ జట్టుకు సైతం ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. ఈనెల 29 నుండి చండీఘర్ లో జరిగే జాతీయ స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలలో రాష్ట్ర జట్టు తరఫున శ్రీ చైత్ర రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చైత్ర రెడ్డి మాట్లాడుతూ తాను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా జట్టు విజయానికి మార్గ నిర్దేశం కోసం కృషి చేసిన జిల్లా సెక్రెటరీ రామచంద్రుడు, పిడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులకు శ్రీ చైతన్య రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ చట్టల గురించి తెలుసుకోవాలి.

- బాల్యవివాహాలు, బాల్యకార్మిక వ్యవస్థ రూపుమాపాలి.
- "రైతే రాజు - వ్యవసాయమే జీవనాధారం"- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్
- కే. లక్ష్మీపతి గౌడ్



**నారాయణపేట, ఏప్రిల్,23 :** నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అప్పకపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతి గౌడ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ వారు మాట్లాడుతూ వ్యవసాయం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఆహారం, ఆధునిక పద్ధతులు గురించి, రైతులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. ఇది మన ఆరోగ్యానికే కాదు, భూమికి కూడా మంచిది. మట్టి ఆరోగ్యం కాపాడుకోవడం, పంటల దిగుబడి పెంచడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో సహాయపడుతుంది. సరైన మార్కెటింగ్ లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు రైతులకు పెద్ద సమస్యలు. భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా గురించి తెలుసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు కచ్చితంగా కలిగి ఉండాలి. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు తెలిపారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్యారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. చిన్న పిల్లలకు 18 ఇయర్స్ నిండకముందే వారికీ పెళ్లిళ్లు చేస్తున్నారని తెలిపారు. అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన మరియు ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, తమ పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా ఈ కార్యక్రమంలో ఎం.సుధాకర్(ఏ.ఈ.ఓ), పీ. విజయ్ కుమార్ (పంచాయతి సెక్రటరీ), అబ్దుల (గ్రామ ఉప సర్పంచు) మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

- దౌల్తాబాద్ వైద్యఅధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని.

**దౌల్తాబాద్ మండలం, ఏప్రిల్,23 :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యమాన్ని



సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ మరియు మాటూర్ గ్రామాల్లో ఉచిత చాతి ఎక్సరే క్యాంప్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు ఈ క్యాంప్ లో 110 మందిని పరీక్షించగా 4 మంది టీబీ అనుమాలితులుగా గుర్తించడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ రఫీ, రాహత్( ఎస్ టీ ఎస్) రవి ఎక్సరే టెక్నీషన్,శ్రీధర్ ఎల్.టీ మరియు ఏఎన్ఎం లు అనిత, అనురాధ మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ కార్మికులకు రెండవ రోజు సమ్మెకు సంఘీభావం తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 23 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల ఆహ్వానం మేరకు 2వ రోజు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరావధిక సమ్మెకు సంఘీభావం తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గారు ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని, గత సంవత్సరం ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పి మోసం చేశారని శాంతియుతంగా నిరావధిక సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని, పోలీస్ పహారాతో వారు వేసుకున్న టెంట్ లను తీసివేసి, ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతియుతంగా చేయిస్తున్న సమ్మెను అడ్డుకోవడం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాయడం రాజ్యాంగాన్ని కూని చేయడమే అని మండిపడ్డారు. ఉచిత బస్సు అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఒక్క బస్సులో 56 మందికి బదులు 100 మందికి పైగా ప్రయాణికులను ఎక్కించుకొని గమ్యస్థానాలను సురక్షితంగా చేరుస్తున్న ఆర్టీసీ కార్మికులపై పోలీసు లాఠీలను జూలిపించడం, ఆర్టీసీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజా స్వామీకం అని మండిపడ్డారు అధికార ప్రోగ్రాం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రైవేటు బస్సులను అక్కడక్కడ నడపడం ఆర్టీసీ కార్మికుల పొట్ట కొట్టడమే అని మండిపడ్డారు. ప్రజా పాలన అంటే శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల టెంట్లు తీసి వేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడమేనా అని ప్రశ్నించారు దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతుల గురిచేసిన వారిపై లాఠీ జలుపించిన పోలీసు యంత్రాంగం రాబోయే మా ప్రభుత్వంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేసిన లాఠీలు జరిపించిన జరగబోయే పరిణామాలకు పోలీస్ యంత్రాంగం, ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు,ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు

# కార్మికుల దీక్షా దినం మే డే జయప్రదం చేద్దాం

- ప్రతి గ్రామంలో ఎర్రజెండాను ఎత్తుదాం
- సోషలిజం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య




**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 23 :** అంతర్జాతీయ కార్మికుల హక్కుల దీక్ష దినం మే 1న మే డే ను జయప్రదం చేయాలని, గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగరేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. పని గంటల తగ్గింపు కోసం పోరాటంలో పుట్టిన జెండా ఎర్ర జెండా అని శ్రమజీవులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటు ందని అన్నారు. నేడు అంతర్జాతీయంగా పెట్టుబడి దారులు తమ యొక్క లాభాలను పెంచుకుంటూ కార్మికులను తీవ్రమైన శ్రమదోపిడికి గురి చేయడం జరుగుతుంది అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కంపెనీలకు, దోపిడి శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లను తెచ్చిందని అన్నారు ఆధునిక సమాజంలో పరిశ్రమల కార్మికులతో పాటు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్, గ్రామపంచాయతీ, అంగన్వాడీ,ఆశా, మధ్యాహ్న భోజనం, ఐ కే పి సి ఏ లు,ఆర్ పి లు, అసంఘటితరంగా కార్మికులు భవన నిర్మాణం, హమాలీ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర రంగాల కార్మికులు శ్రమ దోపిడి ఊరవుతున్నారని అన్నారు ఉపాధి భద్రత, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ సౌకర్యాలు లేవని అన్నారు. రైతులకు సబ్సిడీలు తొలగించడం, కనీస మద్దతు ధర ఇవ్వకపోవడం, ఉపాధి హామీ కార్మికులకు పనిలేకుండా చేయడం, శ్రమకు తగినజీతాలు ఇవ్వకపోవడం జరుగుతుందని అన్నారు. విద్య వైద్యాన్ని ప్రైవేటుపరం చేసి పేదలను దరిద్రులుగా మారు-స్తున్నారని అన్నారు. సోషలిజం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మిక హక్కుల కోసం, ప్రత్యామ్నాయ విధానాల కోసం మే డే స్ఫూర్తి తీసుకొని పోరాటం చేయాలని మే డే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామ గ్రామాన జరపాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, యాదగిరి కనుకయ్య బాబు కనకవ్వ నర్సింలు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# పేట కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి

**నారాయణపేట, ఏప్రిల్,23 :** నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథ జయంతి వేడుకలకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ...భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు.

ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ అర్ వో ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజనేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజాప్రతినిధులు,బి. సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వికారాబాద్ బస్ డిపోను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.

**వికారాబాద్,ఏప్రిల్,23 :** టీజీఎస్ఆర్టీసీ (౧+ూ=ుజ) జేఏసీ సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో, వికారాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖూా క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి, బస్సుల రాకపోకలు మరియు డిపో వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరఫున పూర్తిస్థాయి-ంలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు. జిల్లా లోని మూడు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోంది,విల్లింగ్ ఉన్న డ్రైవర్లు విధులకు హాజరుకావాలని, పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుంది అని తెలిపినారు. మరియి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడటమే తమ ప్రాధాన్యతని ఆమె పేర్కొన్నారు.

# రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన శ్రీ చైత్ర రెడ్డి



**పెద్దముల్ మండలం, ఏప్రిల్,23 :** తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ జట్టుకు శ్రీ చైత్ర రెడ్డి ఎంపికయ్యారు. పెద్దేముల్ మండలం గిర్మా పూర్ గ్రామ రైతు పటేల్ రాంరెడ్డి కూతురు శ్రీ చైతన్య రెడ్డి తాండూర్ లోని మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9 తరగతి చదువుతూ జనని క్రికెట్ అకాడమీలో గత మూడు సంవత్సరాలుగా శిక్షణ పొందుతుంది. ఈ నేపథ్య ంలో గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ అండర్ 17 క్రికెట్ పోటీలకు వికారాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ, రంగారెడ్డి జిల్లా జట్టులో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీలో ప్రతిభను కనబరిచి స్థానం సంపాదించింది. అనంతరం ఈనెల 19 నుండి 22 వరకు రంగారెడ్డి జిల్లా గుర్రం గూడా లోని జిఎన్ఆర్ గ్రౌండ్స్ లో జరిగిన ఎస్ జీ ఎఫ్ అండర్ 17 బాలికల క్రికెట్ తరఫున ఆడింది. సెమీఫైనల్ లో రంగారెడ్డి జిల్లా జట్టు వరంగల్ పై విజయం సాధించడంలో శ్రీ చైతన్య రెడ్డి కీలకపాత్ర పోషించింది. అలాగే ఫైనల్ లో రంగారెడ్డి జట్టు హైదరాబాద్ జట్టు పై ఘన విజయం సాధించడంలో శ్రీ చైత్ర రెడ్డి ఓపెనర్ బ్యాట్స్మెన్ గానే కాకుండా పీక్ ఓవర్స్ లో ఆఫ్ స్పిన్ తో రాణించి తన ప్రతిభను చాటింది. ఈ నేపథ్యంలో ఆల్ రౌండర్ గా మంచి ప్రదర్శనతో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీల కు సిద్ధమైన రాష్ట్ర అండర్ 17 క్రికెట్ జట్టుకు శ్రీ చైతన్య రెడ్డి ఎంపికైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిఈఓ సుసింధర్ రావు, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ రామచంద్రుడు, రాష్ట్ర పీఈటి సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రవికుమార్ ,సాబెర్ తదితరులు గెలిచిన జిల్లా జట్టును అభినందించారు. సెమీఫైనల్ ఫైనల్ లో జట్టులో కీలక పాత్ర పోషించిన శ్రీ చైత్ర రెడ్డిని వారు అభినందించారు. రాష్ట్ర జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ చైతన్య రెడ్డి జాతీయ జట్టుకు సైతం ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. ఈనెల 29 నుండి చండీఘర్ లో జరిగే జాతీయ స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలలో రాష్ట్ర జట్టు తరఫున శ్రీ చైత్ర రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చైత్ర రెడ్డి మాట్లాడుతూ తాను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా జట్టు విజయానికి మార్గ నిర్దేశం కోసం కృషి చేసిన జిల్లా సెక్రటరీ రామచంద్రుడు, పిడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులకు శ్రీ చైతన్య రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ చట్టల గురించి తెలుసుకోవాలి.

- బాల్యవివాహాలు, బాల్యకార్మిక వ్యవస్థ రూపుమాపాలి.
- "రైతే రాజు - వ్యవసాయమే జీవనాధారం"- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్
- కే. లక్ష్మీపతి గౌడ్




**నారాయణపేట, ఏప్రిల్,23 :** నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అప్పకపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మీపతి గౌడ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ వారు మాట్లాడుతూ వ్యవసాయం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఆహారం, ఆధునిక పద్ధతులు గురించి, రైతులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. ఇది మన ఆరోగ్యానికే కాదు, భూమికి కూడా మంచిది. మట్టి ఆరోగ్యం కాపాడుకోవడం, పంటల దిగుబడి పెంచడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో సహాయపడుతుంది.సరైన మార్కెటింగ్ లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు రైతులకు పెద్ద సమస్యలు.భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా గురించి తెలుసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు.విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు కచ్చితంగా కలిగి ఉండాలి.నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు తెలిపారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. చిన్న పిల్లలకు 18 ఇయర్స్ నిండకముందే వారికీ పెళ్లిళ్లు చేస్తున్నారని తెలిపారు.అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన మరియు ముఖ్యంగా,సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, తమ పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా ఈ కార్యక్రమంలో ఎం.సుధాకర్(ఏ.ఈ.ఓ), పీ. విజయ్ కుమార్ (పంచాయతి సెక్రటరీ), అబ్దుల (గ్రామ ఉప సర్పంచు) మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

- దౌల్తాబాద్ వైద్యఅధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని.

**దౌల్తాబాద్ మండలం, ఏప్రిల్,23 :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యమాన్ని





సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ మరియు మాటూర్ గ్రామాల్లో ఉచిత చాతి ఎక్సరే క్యాంప్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు ఈ క్యాంప్ లో 110 మందిని పరీక్షించగా 4 మంది టీబీ అనుమానితులుగా గుర్తించడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ రఫీ, రాహత్( ఎస్ టీ ఎస్) రవి ఎక్సరే టెక్నీషన్,శ్రీధర్ ఎల్.టీ మరియు ఏఎన్ఎం లు అనిత, అనురాధ మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ కార్మికులకు రెండవ రోజు సమ్మెకు సంఘీభావం తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 23 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల ఆహ్వానం మేరకు 2వ రోజు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరావధిక సమ్మెకు సంఘీభావం తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గారు ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని, గత సంవత్సరం ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పి మోసం చేశారని శాంతియుతంగా నిరావధిక సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని, పోలీస్ పహారాతో వారు వేసుకున్న టెంట్ లను తీసివేసి, ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతియుతంగా చేయిస్తున్న సమ్మెను అడ్డుకోవడం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాయడం రాజ్యాంగాన్ని కూని చేయడమే అని మండిపడ్డారు. ఉచిత బస్సు అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఒక్క బస్సులో 56 మందికి బదులు 100 మందికి పైగా ప్రయాణికులను ఎక్కించుకొని గమ్యస్థానాలను సురక్షితంగా చేరుస్తున్న ఆర్టీసీ కార్మికులపై పోలీసు లాఠీలను జూలిపించడం, ఆర్టీసీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజా స్వామీకం అని మండిపడ్డారు అధికార ప్రోగ్రాం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రైవేటు బస్సులను అక్కడక్కడ నడపడం ఆర్టీసీ కార్మికుల పొట్ట కొట్టడమే అని మండిపడ్డారు. ప్రజా పాలన అంటే శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల టెంట్లు తీసి వేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడమేనా అని ప్రశ్నించారు దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతుల గురిచేసిన వారిపై లాఠీ జలుపించిన పోలీసు యంత్రాంగం రాబోయే మా ప్రభుత్వంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేసిన లాఠీలు జరిపించిన జరగబోయే పరిణామాలకు పోలీస్ యంత్రాంగం, ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు,ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు

# కార్మికుల దీక్షా దినం మే డే జయప్రదం చేద్దాం

- ప్రతి గ్రామంలో ఎర్రజెండాను ఎత్తుదాం
- సోషలిజం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య




**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 23 :** అంతర్జాతీయ కార్మికుల హక్కుల దీక్ష దినం మే 1న మే డే ను జయప్రదం చేయాలని, గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగరేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. పని గంటల తగ్గింపు కోసం పోరాటంలో పుట్టిన జెండా ఎర్ర జెండా అని శ్రమజీవులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటు ందని అన్నారు. నేడు అంతర్జాతీయంగా పెట్టుబడి దారులు తమ యొక్క లాభాలను పెంచుకుంటూ కార్మికులను తీవ్రమైన శ్రమదోపిడికి గురి చేయడం జరుగుతుంది అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కంపెనీలకు, దోపిడి శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లను తెచ్చిందని అన్నారు ఆధునిక సమాజంలో పరిశ్రమల కార్మికులతో పాటు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్, గ్రామపంచాయతీ, అంగన్వాడీ,ఆశా, మధ్యాహ్న భోజనం, ఐ కే పి సి ఏ లు,ఆర్ పి లు, అసంఘటితరంగా కార్మికులు భవన నిర్మాణం, హమాలీ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర రంగాల కార్మికులు శ్రమ దోపిడి ఊరవుతున్నారని అన్నారు ఉపాధి భద్రత, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ సౌకర్యాలు లేవని అన్నారు. రైతులకు సబ్సిడీలు తొలగించడం, కనీస మద్దతు ధర ఇవ్వకపోవడం, ఉపాధి హామీ కార్మికులకు పనిలేకుండా చేయడం, శ్రమకు తగినజీతాలు ఇవ్వకపోవడం జరుగుతుందని అన్నారు. విద్య వైద్యాన్ని ప్రైవేటుపరం చేసి పేదలను దరిద్రులుగా మారుస్తున్నారని అన్నారు. సోషలిజం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మిక హక్కుల కోసం, ప్రత్యామ్నాయ విధానాల కోసం మే డే స్ఫూర్తి తీసుకొని పోరాటం చేయాలని మే డే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామ గ్రామాన జరపాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, యాదగిరి కనుకయ్య బాబు కనకవ్వ నర్సింలు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# పేట కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి

**నారాయణపేట, ఏప్రిల్,23 :** నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథ జయంతి వేడుకలకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ...భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు.

ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ అర్ వో ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజనేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజాప్రతినిధులు,బి. సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






# ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వికారాబాద్ బస్ డిపోను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.

**వికారాబాద్,ఏప్రిల్,23 :** టీజీఎస్ఆర్టీసీ (౧+ూ=ుజ) జేఏసీ సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో, వికారాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ×ూూ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి, బస్సుల రాకపోకలు మరియు డిపో వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరఫున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు.జిల్లా లోని మూడు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోంది,విల్లింగ్ ఉన్న డ్రైవర్లు విధులకు హాజరుకావాలని, పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుంది అని తెలిపినారు. మరియు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడటమే తమ ప్రాధాన్యతని ఆమె పేర్కొన్నారు.



## నాటక రంగానికి అంకితం

# శేఖర్ బాబు జీవితం

### నేడు పందిళ్ల శేఖర్‌బాబు వర్ధంతి

**పందిళ్ల శేఖర్‌బాబు (ఆగష్టు 15, 1961 - ఏప్రిల్ 24, 2015) రంగస్థల (పౌరాణిక) నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు. ఆయన 1961, ఆగష్టు 15 వ తేదీన వరంగల్ జిల్లా, ధర్మసాగర్లో రాజయ్యశాస్త్రి, సుచేత దంపతులకు జన్మించారు. బాల్యమంతా ధర్మసాగరంలోనే గడించింది. హనుమకొండలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం దేవాదాయ ధర్మదాయ శాఖలో ఉద్యోగిగా చేరడం, కార్యనిర్వహణ ధికారిగా ఉన్నతస్థానం సాధించడం అన్ని వరంగల్ లోనే జరిగాయి. అంతటితో ఆగకుండా కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎంఏ చదివి, ఆ తరువాత ఎల్.ఎల్.బి. చేశారు.**



పందిళ్ల శేఖర్‌బాబు తన 12వ ఏట 1973లో ఆత్మహత్య సాంఘిక నాటికలో సన్యాసి రాజు పాత్రతో రంగ ప్రవేశం చేసారు. తొలి ప్రయత్నంలోనే బహుమతుల (ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ నటుడు) ను అందుకున్నారు. నాటక ప్రవేశం సాంఘిక నాటిక ద్వారా జరిగినా ఈయనకు పేరు తెచ్చినవి మాత్రం పౌరాణికాలు. 1997వ సంవత్సరం మార్చి 1న ఈయన పౌరాణిక నాటక రంగంలోకి అడుగు పెట్టారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, శ్రీకృష్ణ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. రవీంద్రభారతి, తెలుగు విశ్వ విద్యాలయం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైద్రాబాద్), మహతి (తిరుపతి), హనుమంతరాయ గ్రంథాలయం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల కళావేదిక (విజయవాడ), శ్రీ వేంకటేశ్వర విజ్ఞానకేంద్రం (గుంటూరు) మొదలైన ప్రముఖ వేదికలపై, ఇతర ప్రాంతాల్లో దాదాపు 500 నాటక ప్రదర్శనల్లో నటించారు.

**శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, దుర్యోధనుడిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా, నారదుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, అక్రూరుడిగా, నారదుడిగా,లవకుశలో రాముడిగా, యయాతిలో య యాతిగా,చింతామణిలో బిల్వ మంగళుడిగా, భవానీ శంకరుడిగా, బభ్రువాహనలో అర్జునుడిగా, అన్నమ య్యగా నటించారు.**

1998లో తెలుగు పద్యాన్ని బ్రతికించండి- పద్యనాటక మనుగడకు సహకరించండి అనే నినాదంతో 'తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్'ను స్థాపించారు. ఈ సంస్థ, ఒకవైపు ప్రసిద్ధమైన నాటకాలను ప్రదర్శిస్తూ, మరోకవైపు ఎంతో సమ-ర్థవంతంగా నాటక పోటీలను నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్రంలోని ఎన్నో పట్టణాలలో ఎన్నో ప్రదర్శనల్ని దిగ్విజయంగా ప్రదర్శించి, ప్రేక్షకుల్ని పరవశింప జేసింది తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్.

**2007లో 'శ్రీకృష్ణరాయబారం' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ పద్యపఠనం విభాగాలలో రెండు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2011లో 'యయాతి' నాటకానికి ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ పాత్రోచిత నటుడు విభాగాలలో మూడు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2012లో యయాతి' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం విభాగాలలో రెండు గరుడ అవార్డులు, 'బభ్రువాహన' పద్య నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ పాత్రోచితనటి విభాగాలలో మూడు గరుడ అవార్డులు లభించడంలో ఆయన కృషి ఎంతో ఉంది.**

నటులకు ప్రోత్సాహాన్నిచ్చి, వివిధ పరిషత్తులతో పాటు, ప్రముఖ వేదికలపై నాటకాల నిర్వాహణ, దర్శకత్వ బాధ్యతల నిర్వాహణ గావించారు. 2008 నుండి 'వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక' అధ్యక్షునిగా, ప్రతి యేటా క్రమం తప్పకుండా నాటిక పోటీలను నిర్వహించారు. 'రంగస్థల కళాకారుల క్రెడిట్ సొసైటీ'ని నిర్వహిస్తూ, తద్వారా వచ్చే లాభాలు, వడ్డీల నుండి 50 శాతం 'ఐక్యవేదిక'కు కేటాయించి, సంస్థకు ఆర్థికంగా పరిపుష్టం గావించారు.

**న్యాయ నిర్ణేతగా ఆయన నిర్ణయం నిష్పాక్షికమైనది. రాగద్వేషాలకు తావీయకుండా, ప్రతిభకు పట్టంకట్టడంలో ఆయనది అందెవేసిన చేయి. అందుకే రాష్ట్రంలోని ఎన్నో పరిషత్తులు నాటక పోటీలకు గుణనిర్ణేతగా ఆయయను ఆహ్వానించి గౌరవిస్తున్నాయి. 2008లో రాజమండ్రి లో జరిగిన నంది నాటకోత్సవాలకు పౌరాణిక నాటక విభాగంలో ప్రాథమిక న్యాయ నిర్ణేతగా 2009, 2011 సంవత్సరంలో అభినయ పరిషత్ వారు నిర్వహించే హనుమ అవార్డుల పోటీల పౌరాణిక నాటక విభాగంలో న్యాయ నిర్ణేతగా, 2012లో రవీంద్రభారతిలో జరిగిన పి.ఎం.కె.ఎం. సాంఘీక నాటకపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.**

శేఖర్ బాబు నిర్విరామ కృషికి, దీక్షాదక్షతలను గుర్తించిన అనేక సంస్థలు ఆయనకు నటశేఖర, పౌరాణిక నట సార్వభౌమ, పౌరాణిక విద్వన్మణి, మెగా సిటిజన్, శ్రీపాద నాటక కళాపరిషత్ వారి పురస్కారం, పద్యనాటక కళాధురీణ వంటి బిరుదులనిచ్చి సత్కారం చేశాయి.

**2000 సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ నుండి 11వ తేదీవరకు 7రోజుల పాటు వరుసగా ఒకే వేదికపై శ్రీకృష్ణ రాయబారం, లవకుశ, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, గయో పాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలను 'పద్య నాటక సప్తాహం' పేరిట, ఏడు రోజులు వరుసగా ప్రదర్శించి, ప్రధాన పాత్రలను ధరించారు. 2011లో మరలా 'పద్యనాటక సప్తకం ' నిర్వహించి స్వీయ దర్శకత్వంలో 7 నాటకాలను, వారానికొకటి చొప్పున ప్రదర్శించి, ప్రధాన పాత్రలు ధరించి, నిర్వాహణ వ్యయం 3 లక్షలు భరించారు. 2012లో తొలి తెలుగు సినీ రచయిత, 'పరబ్రహ్మ పరమేశ్వర' ప్రార్థనా గీత రచయిత చందాల కేశవదాసు 136వ జయంతి ఉత్సవం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం (హైద్రాబాద్) లో నిర్వహించారు.**

2010లో అజో-విభో ఫౌండేషన్ వారు వరంగల్ లో నిర్వహించిన, 'సాహితీమూర్తి పురస్కారం' డా. నల్లాన్ చక్రవర్తుల రఘునాథ చార్యులకు ప్రదానం చేసిన కార్యక్రమాన్ని కలిసి నిర్వహించారు. అనారోగ్య కారణాల వల్ల హైదరాబాద్ లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 24, 2015న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
**9440595494**

# గత కాలపు గవాక్షం.. సత్య శోధనల సాక్ష్యం

### అక్షర తపస్వి ఎం వి ఆర్ శాస్త్రికి జీవిత సాఫల్యం

### కలానికి కరచాలనం.. కృషీవలుడు శాస్త్రికి జీవిత సాఫల్యం



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికారంగం ఒక సజీవ శక్తి. అది కేవలం నిత్యం జరిగే సంఘటనలను వార్తలుగా మోసుకెళ్లే వాహిక మాత్రమే కాదు; సమాజ చైతన్యాన్ని మేల్కొలిపే దివ్యౌషధం, పాలకుల అసంబద్ధ నిర్ణయాలను నిలదీసే ధైర్యం, చరిత్రను సజీవ సాక్ష్యాలతో నిక్షిప్తం చేసే ఒక బాధ్యతాయుత వ్యవస్థ. ఈ విలువలను తన మూడు దశాబ్దాల వృత్తి జీవితమంతా శ్వాసించి, ఆచరణలో పెట్టిన అగ్రశ్రేణి పాత్రికేయ దిగ్గజం ఎం.వి.ఆర్. శాస్త్రికి 'జీవిత సాఫల్య పురస్కారం' లభించడం ఒక వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, అది తెలుగు పత్రికారంగ నైతిక విలువలకే దక్కిన అరుదైన గుర్తింపు. మునగాల వేంకట రామశాస్త్రి గారు పాత్రికేయ వనంలో ప్రవేశించిన నాటికే మీడియా రంగంలో విలువల ఆధారిత రచనలకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఆయన ఆ రంగానికి ఒక కొత్త పరిశోధనాత్మక పరిమళాన్ని అద్దారు. వార్తను కేవలం ఉపరితల స్థాయిలో చూసి వదిలేయకుండా, దాని వెనుక దాగి ఉన్న చారిత్రక, సామాజిక, ఆర్థిక మూలాలను తవ్వి తీయాల్సిన ఆవశ్యకతను ఆయన తొలినాళ్లలోనే గుర్తించారు. అందుకే ఆయన కలం నుండి జాలువారిన సంపాదకీయమైనా, సంకలనమైనా ఒక సామాన్య వార్తలా కాకుండా, ఒక సంపూర్ణ పరిశోధనా వ్యాసంలా పాఠకుడి ముందు నిలుస్తుంది.

శాస్త్రి జర్నలిజం కేవలం సమకాలీన రాజకీయాల విశ్లేషణకు పరిమితం కాలేదు. చరిత్రను లోతుగా అధ్యయనం చేసి, సాక్ష్యాధారాలతో సమాజానికి అందించే ఒక అరుదైన ఒరవడికి ఆయన ప్రతీకగా నిలిచారు. రాజకీయంలో ప్రతి చిన్న పరిణామాన్నీ ఆయన చరిత్రతో అనుసంధానం చేసే తీరు అద్భుతం. భారత రాజకీయ వ్యవస్థలో సంభవించిన పెనుమార్పులపై ఆయన రాసిన వ్యాసాలు ఒక చారిత్రక కాలక్రమాన్ని కళ్లకు కడతాయి. స్వాతంత్ర్యానంతరం నుండి నేటి వరకు రాజ్యాంగంలో జరిగిన సవరణలు, ఆర్టికల్ 356 దుర్వినియోగం, కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లోని ఘర్షణలు, ఎన్నికల విధానంలో వచ్చిన మార్పులు వంటి క్లిష్టమైన అంశాలను ఆయన చరిత్రాత్మక దృష్టితో విశ్లేషించి, వాటి ప్రస్తుత ప్రభావాన్ని స్పష్టంగా వివరించేవారు. ఇది సాధారణ పాత్రికేయతకు మించిన ఒక పండిత స్థాయి పరిశోధనా దృక్కోణం. ఆయన రచనల్లో 'రుజువు' అనేది అత్యంత శక్తిమంతమైన ఆయుధం. ఏదైనా ఒక అంశంపై స్పందించే ముందు ఆయన పాత పత్రికా కట్టలు, దుమ్ము పట్టిన ప్రభుత్వ నివేదికలు, ప్రామాణిక చరిత్ర గ్రంథాలు, గణాంక వివరాలను క్షుణ్ణంగా శోధించేవారు. ఒక సందర్భంలో వ్యవసాయ సంక్షోభంపై ఆయన చేసిన విశ్లేషణ ఇందుకు తిరుగులేని నిదర్శనం. గత పాతికేళ్ల పంట దిగుబడులు, రైతుల రుణభారం, వర్షపాత గణాంకాలు మరియు ప్రభుత్వ విధానాలలోని వైఫల్యాలను తార్కికంగా విశ్లేషించి, ఆ సమస్య తీవ్రతను సమాజం ముందుంచారు. అలాగే పట్టణీకరణ వల్ల తలెత్తిన జనాభా ఒత్తిడి, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలను కేవలం అభిప్రాయాలుగా కాకుండా, తిరుగులేని ఆధారాలతో నిరూపించారు.

**ఆయనకు చరిత్ర పట్ల ఉన్న గౌరవం, అధ్యయనం పట్ల ఉన్న నిబద్ధత ఆయన రచనలకు ఒక ప్రత్యేక బలాన్ని ఇచ్చాయి. భూసంస్కరణలపై ఆయన చేసిన విశ్లేషణలో బ్రిటీష్ కాలం నాటి జమీందారీ వ్యవస్థ నుండి మొదలుకొని, స్వాతంత్ర్యానంతర భూ పంపిణీలో జరిగిన అక్రమాల వరకు ప్రతి అంశాన్ని చారిత్రక కోణంలో విడమర్చి చెప్పారు. దీనివల్ల పాఠకుడికి ఒక సమస్యపై సంపూర్ణమైన అవగాహన ఏర్పడేది. ఒక రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు దానికి దారితీసిన పరిణామాలను మొదటి నుండి చివరి వరకు క్రమబద్ధంగా, కాలక్రమానుసారంగా వివరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఏ పార్టీ ఎప్పుడు ఏ తీర్మానం చేసింది, ఏ నాయకుడు ఏ సమయంలో తన వైఖరి మార్చుకున్నాడు అనే వివరాలను ఆధారాలతో సహా వరుస క్రమంలో పేర్చడం ద్వారా పాఠకుడికి ఒక స్పష్టమైన దృశ్యం కనిపిస్తుంది. ఒక రాష్ట్రంలో ప్రభుత్వాల పతనంపై ఆయన రాసిన విశ్లేషణలు రాజకీయ విద్యార్థులకు పాఠ్యగ్రంథాల వంటివి. ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకుడిగా ఆయన రాసిన "ఉన్నమాట" కాలమ్ తెలుగు పత్రికారంగంలో ఒక సంచలనం. నిశితమైన విమర్శ, పదునైన వ్యంగ్యం, అంతకుమించిన వాస్తవికత ఆ కాలమ్ సొంతం. సమకాలీన రాజకీయ నాయకుల ద్వంద్వ నీతిని ఎండగట్టడంలో ఆయన కలం ఏనాడూ వెనుకాడలేదు.**

శాస్త్రి భాషా పటిమ గురించి ఎంత చెప్పినా తక్కువే. క్లిష్టమైన చారిత్రక, సాంకేతిక అంశాలను సైతం అత్యంత సరళమైన, అచ్చతెలుగు పదజాలంతో సామాన్య పాఠకుడికి అర్థమయ్యేలా రాయడం ఆయన ప్రత్యేకత. సంక్లిష్టమైన వాక్య నిర్మాణాలకు పోకుండా, భావవ్యక్తీకరణలో స్పష్టతను పాటిస్తూ ఆయన రాసిన వ్యాసాలు భాషాభిమానులను సైతం అలరిస్తాయి. సామాజిక బాధ్యత పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అచంచలమైనది. పేదల సమస్యలు, రైతుల కష్టాలు, విద్యా రంగంలో నెలకొన్న అసమానతలు ఆయనను నిరంతరం వేధించేవి. విద్యా రంగంపై ఆయన చేసిన విశ్లేషణలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకం వంటి అంశాలపై ప్రభుత్వాలకు గట్టి పరిష్కార మార్గాలను సూచించేవి. ఆయన రాసిన 'ఇదీ చరిత్ర', '1857 మనం మరచిన మహాయుద్ధం', 'కాశ్మీర్ కథ', 'ఆంధ్రుల కథ' వంటి గ్రంథాలు తెలుగు సాహిత్య మరియు చారిత్రక రంగాల్లో మైలురాళ్లుగా నిలిచాయి. చరిత్రను వక్రీకరించే శక్తులకు వ్యతిరేకంగా ఆయన పట్టిన కలం అజేయమైనది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మరుగున పడిన వీరుల గాథలను వెలికితీసి, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిపిన ఘనత ఆయనది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై గానీ, భగత్ సింగ్ వంటి విప్లవకారుల పోరాటాల పైన గానీ ఆయన చేసిన విశ్లేషణలు పాఠకులలో జాతీయ భావాన్ని ఉప్పొంగిస్తాయి.

**ప్రస్తుత కాలంలో మీడియా రంగం ఫేక్ న్యూస్, రాజకీయ పక్షపాతం, కార్పొరేట్ ప్రయోజనాల వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఎం.వి.ఆర్. శాస్త్రి వంటి నిబద్ధత కలిగిన పాత్రికేయుల అవసరం ఎంతైనా ఉంది. వాస్తవాలను నిర్భయంగా చెప్పడం, అధికారంలో ఉన్నవారిని నిలదీయడం, సమాజ హితాన్ని కాంక్షించడం వంటి విలువలు నేటి తరం పాత్రికేయులు ఆయన నుండి నేర్చుకోవాల్సిన పాఠాలు. జర్నలిజం అనేది కేవలం ఒక వృత్తి కాదు, అదొక సామాజిక బాధ్యత అని ఆయన తన సుదీర్ఘ ప్రస్థానంలో నిరూపించారు. పత్రికారంగ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్న ఈ రోజుల్లో, శాస్త్రి గారి వంటి మేధావుల కృషి ప్రజాస్వామ్యానికి బలమైన అండగా నిలుస్తుంది. ఆయనకు దక్కిన జీవిత సాఫల్య పురస్కారం ఆయన చేసిన దశాబ్దాల తపస్సుకు దక్కిన నీరాజనం. ఇది కేవలం ఆయన వ్యక్తిగత విజయమే కాదు, అక్షరాన్ని ఆయుధంగా మలుచుకుని పోరాడే ప్రతి జర్నలిస్టుకు ఒక ప్రేరణ. ఎం.వి.ఆర్. శాస్త్రి ఒక పాత్రికేయుడిగా, నిశిత పరిశోధకుడిగా, చరిత్ర విశ్లేషకుడిగా, వీటన్నింటికీ మించి ఒక నిఖార్సైన భారతీయుడిగా సమాజ చైతన్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ఇలాంటి మహనీయుల కృషిని గుర్తించడం ద్వారా సమాజం విలువల ఆధారిత పత్రికారంగాన్ని ప్రోత్సహించినట్లవుతుంది. సత్యాన్ని శోధించే ఆసక్తిని పెంపొందిస్తూ, పాఠకుడిని ఆలోచింపజేసే ఆయన రచనలు తెలుగు నేల ఉన్నంత కాలం చరిత్ర సాక్ష్యాలుగా నిలిచిపోతాయి. ఆయన అక్షర ప్రస్థానం అప్రతిహతంగా సాగాలని, మరిన్ని విలువైన విశ్లేషణలు ప్రజలకు అందాలని ఆకాంక్షించడం ప్రజాస్వామ్యవాదుల బాధ్యత.**

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
**9440595494**





# పాత్రికేయ కురువృద్ధులు నండూరి

**నేడు నండూరి రామమోహనరావు జయంతి**

తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నండూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు.

**నండూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927- సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. "బాల" అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. "నరావతారం", "విశ్వరూపం" ఈయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నండూరి కృషి మరవ లేనిది. అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నండూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్రవ్యక్తి అనువాద రచనలు ఆకట్టు కునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది.**

ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా 'ఆంధ్రజ్యోతి'లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా...దాదాపు మూడున్నర దశాబ్దలు ఆయన 'ఆంధ్రజ్యోతి'లో రచనా జైత్ర యాత్ర కొన సాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నండూరి 'ఆంధ్రజ్యోతి' సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కందాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు.

ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నండూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నండూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి 'విశ్వరూపం' అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే 'విశ్వ దర్శనం' ఆయన కలం నుంచి జాలువారినవే. నండూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు.

మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నండూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి 'మహా సంకల్పం' అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నండూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు.

ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకాగణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీలతోపాటు 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితలతో నండూరికి సంబంధం, అనుబంధం ఉండేది.

**నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం - భారతీయ చింతన విశ్వదర్శనం - పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి), చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు.**

అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ "ఉగాది వెలుగు" అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి "పాత్రికేయ రత్న" అవార్డు, "జమీన్ రైతు" వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి "శిరోమణి" అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయవాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మొనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494




# మానవ సేవే మాధవ సేవ

**సత్య సాయి 'ప్రేమ పథం' ప్రపంచానికే మార్గదర్శకం!**

**నేడు సత్య సాయిబాబా ఆరాధన మహోత్సవం..**

**పుట్టపర్తి నుంచి విశ్వవ్యాప్తమైన ఆధ్యాత్మిక వెలుగులు**



సత్య సాయిబాబా (నవంబరు 23, 1926 – ఏప్రిల్ 24, 2011) భారతదేశం లోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక గురువు. ఆయన తన జీవిత కాలంలో లక్షలాది మంది భక్తులను ఆకర్షించారు. ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలను బోధించి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.

**శ్రీ సత్య సాయిబాబా 1926 నవంబర్ 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి అనే చిన్న గ్రామంలో జన్మించారు. బాల్యంలో ఆయన అసాధారణమైన ఆధ్యాత్మిక సామర్థ్యాలు ప్రదర్శించారు. అనేక భక్తులు ఆయనలో శక్తి ఉందని భావించారు. 14 సంవత్సరాల వయసులో సత్య సాయిబాబా, తాను శిర్డీ సాయిబాబా పునర్జన్మ అని ప్రకటించి, భక్తుల జీవితాలను మారుస్తూ ఆధ్యాత్మిక గురువుగా మారారు.**

సత్య సాయిబాబా బోధనల హృదయం ప్రేమ, మానవత్వం, సమానత్వం వంటి విలువల చుట్టూనే తిరుగుతుంది. ఆయన 5 సూత్రాలు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా సూచించారు.

**జీవితంలో నిజాయితీ, సత్యవంతత ముఖ్యమైన ఆధ్యాత్మిక గుణాలని ఆయన బోధించారు. కర్తవ్యాలను నిబద్ధతతో నిర్వహించడం, సమాజం పట్ల న్యాయంగా వ్యవహరించడం అవసరం అని అన్నారు. అంతర్గత ప్రశాంతతను సాధించడం ద్వారా మనిషి నిజమైన ఆనందాన్ని పొందగలడని ఆయన వివరించారు. పాత మతాలు, భిన్నత్వాల కతీతంగా ప్రేమతో జీవించమని సందేశం ఇచ్చారు. ఎలాంటి హింస లేకుండా శాంతియుత జీవితం గడపమని ఆయన కోరారు.**

సత్య సాయిబాబా సేవా మార్గం ప్రపంచానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. సత్య సాయిబాబా అనేక విద్యా సంస్థలను స్థాపించారు, అక్కడ నాణ్యమైన విద్యతో పాటు ఆధ్యాత్మిక విలువల్ని బోధిస్తారు. విద్య వ్యాపారం కాకుండా సేవగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఆయన స్థాపించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించ బడతాయి. పేదలకు, బాధితులకు ఉచిత చికిత్స అందించడంలో ఈ ఆసుపత్రులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. సత్య సాయిబాబా ఎన్నో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు కోట్లాది మందికి మేలు చేకూర్చాయి.

**సత్య సాయిబాబా భక్తుల ముందు అనేక అద్భుతాలను ప్రదర్శించారు. విభూతి (పవిత్ర బూడిద) ను చేయి నుంచి ప్రత్యక్షంగా సృష్టించడం, వస్తువులను క్షణాల్లో ఉత్పత్తి చేయడం వంటి అద్భుతాలు ఆయన భక్తులకు విశ్వాసాన్ని కలిగించాయి. ఈ అద్భుతాలు కొందరి విమర్శలకు గురైనా, భక్తులు వాటిని ఆయన ఆధ్యాత్మిక శక్తులుగా భావించారు.**

ఆయన బోధనల ద్వారా అనేక మంది జీవిత విధానంలో మార్పు తీసుకువచ్చి సమాజ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఆయన బోధించిన నైతిక విలువలను తమ రోజువారీ జీవితాల్లో ఆచరిస్తున్నారు. సత్య సాయిబాబా స్థాపించిన సత్య సాయిబాబా ఆర్గనైజేషన్ 100 కంటే ఎక్కువ దేశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థలు విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా వంటి రంగాల్లో ముఖ్యమైన సేవలు అందిస్తున్నాయి.

**సత్య సాయిబాబా బోధనలు అన్ని మతాలకు ఒకే తీరున ప్రామాణికతను చూపాయి. ఆయన సందేశం అన్ని మతాల ప్రాథమిక విలువలను అనుసరిస్తూ, మతసామరస్యం మరియు సమానత్వం గురించి చర్చించేది. సత్య సాయిబాబా తన జీవితకాలంలో పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఆయన చేసే అద్భుతాలను కొందరు మాయా జాలంగా అభివర్ణించారు. ఆయనకు వ్యతిరేకంగా కొన్ని ఆర్థిక అక్రమాల ఆరోపణలు కూడా వచ్చాయి. అయితే, ఆయన భక్తులు ఈ విమర్శలను తోసిపుచ్చి, ఆయనను భగవంతుని అవతారంగా భావిస్తూ తమ విశ్వాసాన్ని కొనసాగించారు. విమర్శలు ఆయన ఆధ్యాత్మిక ప్రభావాన్ని తగ్గించలేక పోయాయి.**

2011 ఏప్రిల్ 24న సత్య సాయిబాబా తన భౌతిక దేహాన్ని విడిచారు. ఆయన మరణం భక్తులకు చాలా బాధాకరమైన విషయం. అయితే, ఆయన స్థాపించిన సంస్థలు, ఆశయాలు మరియు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సత్య సాయిబాబా జన్మస్థలం పుట్టపర్తి, ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. సాయిబాబా సమాధి దగ్గర అనేక భక్తులు ప్రతిరోజూ ప్రార్థనలు చేస్తూ ఆయన బోధనలను గుర్తు చేసుకుంటారు. విద్యా మరియు ఆరోగ్య సేవలుఆయన మరణం తర్వాత కూడా ఆయన స్థాపించిన విద్యా, ఆరోగ్య సేవా సంస్థలు ప్రతిభావంతమైన విద్యార్థులకు విద్యను, పేదలకు వైద్య సేవలను అందిస్తున్నాయి.

**"మానవ సేవే దేవ సేవ" అన్న ఆయన సందేశం ప్రజల హృదయాల్లో గాఢంగా నిలిచి పోయింది. ఆయన స్థాపించిన సేవా కార్యక్రమాలు ప్రపంచానికి వెలుగునిచ్చే దీపాలుగా కొనసాగుతున్నాయి. సత్య సాయిబాబా జీవితం ఒక ఆదర్శంగా ఉంది. ఆయన చూపించిన మార్గం, బోధనలు ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆధ్యాత్మికత, సేవ, ప్రేమ కలిసిన జీవితమే సత్య సాయిబాబా జీవన దర్శనం. ఆయన సేవా భావం మరెన్నో తరాల వరకు మార్గదర్శకంగా నిలుస్తుంది.**



# తెలుగు సినీ చరిత్రలో 'పూర్ణోదయ' ప్రభాతము

**నేడు ఏడిద నాగేశ్వరరావు జయంతి**

తెలుగు సినిమా పేరును ఖండాంతరాలు దాటించి, కళాత్మక చిత్రాలకు కమర్షియల్ విజయాన్ని జోడించిన అరుదైన నిర్మాత ఏడిద నాగేశ్వరరావు. కేవలం తొమ్మిది చిత్రాలు నిర్మించినప్పటికీ, అవన్నీ భారతీయ సినీ చరిత్రలో ఆణిముత్యాలుగా నిలిచిపోయాయంటే ఆయన అభిరుచి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్ 24న ఆయన జయంతి సందర్భంగా, 'పూర్ణోదయ మూవీ క్రియేషన్స్' ద్వారా ఆయన సృష్టించిన అద్భుత దృశ్యకావ్యాలపై ప్రత్యేక విశ్లేషణ.

## నటుడి నుంచి నిర్మాత వరకు..

తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో 1934 ఏప్రిల్ 24న జన్మించిన ఏడిద నాగేశ్వరరావు, పాఠశాల దశలోనే అమ్మాయి వేషధారణతో నటనపై మక్కువ పెంచుకున్నారు. బి.ఎ. చదివే రోజుల్లో దర్శకుడు వి.బి. రాజేంద్రప్రసాద్ పరిచయంతో నాటక రంగంలో రాణించారు. ఆ తర్వాత మద్రాస్ వెళ్లి డబ్బింగ్ కళాకారుడిగా, సుమారు 30 సినిమాల్లో నటుడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 1978లో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'సిరిసిరి మువ్వ' చిత్రానికి నిర్మాణ సారథ్యం వహించి నిర్మాతగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.

## శంకరాభరణం: ఒక చరిత్ర.. ఒక విప్లవం!



తెలుగు సినిమా గతిని మార్చిన చిత్రం 'శంకరాభరణం'. కేవలం 11 లక్షల రూపాయలతో 52 రోజుల్లో నిర్మించిన ఈ సినిమా, జాతీయ స్థాయిలో స్వర్ణ కమలాన్ని సాధించడమే కాకుండా, విదేశీ గడ్డపై కూడా తెలుగు జయకేతనం ఎగురవేసింది. అమెరికాలో ఈ చిత్రం కోసం 'శంకరాభరణం నైట్స్' నిర్వహించడం అప్పట్లో ఒక సంచలనం. ఎర్నాకులంలో రెండేళ్లు ఆడి మలయాళ చిత్ర పరిశ్రమను సైతం ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత వచ్చిన సాగర సంగమం, సీతాకోక చిలుక, స్వాతిముత్యం, సితార వంటి చిత్రాలు జాతీయ అవార్డుల పంట పండించాయి.

## ఆస్కార్ వరకు చేరిన ప్రయాణం

ఏడిద నిర్మించిన 'స్వాతిముత్యం' చిత్రం భారత ప్రభుత్వం తరపున అధికారికంగా ఆస్కార్ నామినేషన్లకు ఎంపిక కావడం విశేషం. 'సాగర సంగమం' బెంగళూరులో 575 రోజులు ఆడి అరుదైన రికార్డు సృష్టించింది. తన కెరీర్‌లో అత్యధికంగా కె. విశ్వనాథ్‌తో సినిమాలు తీసి, కళాత్మక విలువలకు పట్టం కట్టారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారంతో పాటు అనేక లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డులను అందుకున్నారు.

**నిర్మాతగా ఆయన నిర్మించిన ప్రతి సినిమా ఒక పాఠం. వ్యాపారమే పరమావధిగా సాగుతున్న కాలంలో, సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలు తీయవచ్చని నిరూపించిన ఏడిద నాగేశ్వరరావు, తెలుగు సినీ పుస్తకంలో ఒక చెరగని సంతకంగా మిగిలిపోయారు. 2015లో ఆయన భౌతికంగా కన్నుమూసినప్పటికీ, ఆయన అందించిన ఆణిముత్యాల వంటి చిత్రాలు వెండితెరపై నిరంతరం వెలుగుతూనే ఉంటాయి.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## మైదానంలో పరుగుల వర్షం.. బయట డాన్స్ సెన్సేషన్

### ఫిదా చేస్తున్న సన్‌రైజర్స్!

### వైరల్ అవుతున్న ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ డాన్స్ వీడియో

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్టు ఫుల్ జోష్‌లో ఉంది. కేవలం బ్యాట్, బాల్‌తోనే కాకుండా తమదైన శైలిలో వినోదాన్ని పంచుతూ అభిమానుల మనసు గెలుచుకుంటోంది. తాజాగా జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్ శర్మ కలిసి విదేశీ ఆటగాడు ట్రావిస్ హెడ్‌కు డాన్స్ నేర్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. కెమెరా వెనుక నుంచి ఇషాన్, అభిషేక్ స్టెప్పులు వేస్తుంటే, వాటిని అనుకరిస్తూ ట్రావిస్ హెడ్ చేసిన సందడి నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుత సీజన్‌లో ఆరెంజ్ ఆర్మీ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి వరుసగా మూడో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి (7 మ్యాచ్‌లు, 4 విజయాలు, 8 పాయింట్లు) దూసుకెళ్లింది. జట్టు నెట్ రన్ రేట్ (ం0.820) కూడా ఇతర జట్లతో పోలిస్తే మెరుగ్గా ఉండటం ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఈ సీజన్‌లో ఎస్ఆర్హెచ్ బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా యువ సంచలనం అభిషేక్ శర్మ 323 పరుగులతో ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఢిల్లీపై అతను చేసిన అజేయ సెంచరీ (135లి) సీజన్‌కే హైలైట్‌గా నిలిచింది. మరోవైపు స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ కూడా 320 పరుగులతో రెండో స్థానంలో ఉండి గట్టి పోటీనిస్తున్నాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ కూడా బ్యాటింగ్‌లో రాణిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నారు. ఆటగాళ్ల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణమే మైదానంలో జట్టు విజయాలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.



## కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన

### రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ కు జరిమానా, డీమెరిట్ పాయింట్ కూడా.!

రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆర్ఆర్ 40 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో లక్నో జట్టు 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది ఇలా ఉండగా రాజస్థాన్ రాయల్స్ జట్టు పేసర్ నంద్రే బర్గర్ కు పెద్ద షాక్ తగిలింది. మ్యాచ్‌లో కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించినందుకు అతనిపై మ్యాచ్ ఫీజులో 10% జరిమానా విధించారు. అంతేకాకుండా ఒక డీమెరిట్ పాయింట్ కూడా నమోదు చేశారు. ఐపీఎల్ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. బర్గర్ మ్యాచ్ సమయంలో అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డాడు. ముఖ్యంగా ఇతర ఆటగాళ్లను రెచ్చగొట్టేలా లేదా అవమానించేలా మాటలు, చర్యలు, హావభావాలు ప్రదర్శించినందుకు అతను ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఈ ఉల్లంఘన లెవల్-1 కేటగిరీలోకి వస్తుంది. ఈ రకమైన కేసుల్లో మ్యాచ్ రిఫరీ తీసుకునే నిర్ణయం తుదిగా ఉంటుంది. దీనితో బర్గర్ పై విధించిన శిక్ష అమల్లోకి వచ్చింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ విభాగం అద్భుతంగా రాణించి లక్నో సూపర్ జెయింట్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో రాజస్థాన్ జట్టు విజయం సాధించింది.



# సీఎస్‌కే విశ్వరూపం!

- ముంబై ఇండియన్స్‌పై 103 పరుగుల భారీ తేడాతో ఘన విజయం
- సెంచరీతో చెలరేగిన సంజూ శాంసన్
- అకీల్ హుస్సేన్ స్పిన్ మాయాజాలానికి ముంబై విలవిల



**ముంబై, ఏప్రిల్ 24:** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సంచలన విజయం సాధించింది. సొంత గడ్డపై ముంబై ఇండియన్స్ (ఎంఐ)కు ఘోర పరాభవం ఎదురైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సీఎస్‌కే.. ఏకంగా 103 పరుగుల భారీ తేడాతో ముంబైని చిత్తు చేసి టోర్నీలో తమ సత్తా చాటింది.

### సంజూ శాంసన్ సెంచరీ మోత

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 54 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు చేసి ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడితో పాటు రుతురాజ్ గైక్వాడ్ (22), డెవాల్డ్ బ్రెవిస్ (21) పరుగులతో రాణించారు. ముంబై బౌలర్లలో అల్లాహ్ గజన్‌ఫర్ 2, అశ్వనీ కుమార్ 2, జస్‌ప్రీత్ బుమ్రా ఒక వికెట్ తీశారు.


### కుప్పకూలిన ముంబై బ్యాటింగ్

208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఏ దశలోనూ విజయావకాశాలు కనిపించలేదు. సీఎస్‌కే బౌలర్ల ధాటికి ముంబై బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. తిలక్ వర్మ (37), సూర్యకుమార్ యాదవ్ (36) మినహా ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. స్టార్ బ్యాటర్ క్వింటన్ డికాక్ కేవలం 7 పరుగులకే వెనుదిరిగాడు. దీంతో ముంబై 19 ఓవర్లలో కేవలం 104 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

### అకీల్ హుస్సేన్ మాయాజాలం సీఎస్‌కే

స్పిన్నర్ అకీల్ హుస్సేన్ తన స్పిన్ మాయాజాలంతో ముంబై నడ్డి విరిచాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో కేవలం 17 పరుగులు ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ముంబై పతనాన్ని శాసించాడు. అతడికి తోడుగా నూర్ అహ్మద్ 2, గుర్జప్‌నీత్ సింగ్ ఒక వికెట్ తీశారు. బ్యాటింగ్‌లో సంజూ శాంసన్, బౌలింగ్‌లో అకీల్ హుస్సేన్ అద్భుత ప్రదర్శనతో సీఎస్‌కేకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.












# నేహా శర్మ 'బ్లాక్' మ్యాజిక్

## 'చిరుత' బ్యూటీ గ్లామర్ విందు!


## వైరల్ అవుతున్న లేటెస్ట్ ఫొటోషూట్..

తెలుగు తెరపై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పక్కన 'చిరుత'గా గర్జించిన అందాల భామ నేహా శర్మ, మరోసారి ఇంటర్నెట్ లో సెగలు పుట్టిస్తోంది. సినిమాల రిజల్ట్ తో సంబంధం లేకుండా తన గ్లామర్ తో నిరంతరం వార్తల్లో ఉండే ఈ బ్యూటీ, తాజాగా సోషల్ మీడియా వేదికగా వదిలిన ఫోటోలు నెటిజన్ల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. బ్లాక్ డ్రెస్‌లో ఆమె పండించిన సోయగం ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. టాలీవుడ్‌లోకి భారీ ఎంట్రీ ఇచ్చిన నేహా శర్మ, తన మొదటి సినిమాతోనే యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత వరుణ్ సందేశ్‌తో కలిసి 'కుర్రాడు' సినిమాలో నటించినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో టాలీవుడ్‌కు కొంత దూరమైంది. అయితే, పట్టువదలని విక్రమార్కుడిలా బాలీవుడ్ వైపు అడుగులు వేసి, అక్కడ వరుస అవకాశాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. హిందీ వెండితెరపై మోస్తరు విజయాలను అందుకుంటూ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను అలరించడంలో నేహా ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా ఆమె నలుపు రంగు దుస్తుల్లో ఒక అద్భుతమైన ఫోటోషూట్ నిర్వహించింది. ఒక కుర్చీలో స్టైలిష్‌గా కూర్చుని, వేర్వేరు యాంగిల్స్‌లో తన అందచందాలను ఆరబోస్తూ నెటిజన్లను ఫిదా చేసింది. ఆ ఫోటోల్లో నేహా చూపిస్తున్న హావభావాలు, ఆమె స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ లుక్‌లో నేహా అందం చూస్తుంటే, 'మళ్లీ ఈ చిరుత బ్యూటీ టాలీవుడ్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తే బాగుండు' అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. తన గ్లామర్ తో మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన నేహా శర్మ, ముమ్ముందు మరెన్ని క్రేజీ ప్రాజెక్టులతో అలరిస్తుందో చూడాలి.




# విడిగా ఉన్నా... సంతోషంగానే: రకుల్

టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, నటుడు-నిర్మాత జాకీ భగ్నానీ తమ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. 2024 ఫిబ్రవరి 21న గోవాలో ఘనంగా పెళ్లి చేసుకున్న ఈ జంట, పెళ్లి తర్వాత కూడా తమ బంధాన్ని స్వేచ్ఛ, పరస్పర గౌరవంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో రకుల్ మాట్లాడుతూ, "మేమిద్దరం విడిగా ఉన్నా కూడా సంతోషంగానే ఉంటాం. ఒకరి జీవితాన్ని మరొకరు పూర్తిచేయడానికి పెళ్లి చేసుకోలేదు. మేమిద్దరం వ్యక్తిగతంగా కూడా స్ట్రాంగ్‌గానే ఉన్నాం" అని చెప్పింది. కలిసి ఉన్నప్పుడు ఆ ఆనందం మరింత రెట్టింపు అవుతుందని ఆమె పేర్కొంది. జాకీ భగ్నానీ కూడా తమ బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేము భార్యాభర్తలమే అయినా, మా మధ్య ఉన్న స్నేహం, పారదర్శకతే అసలు బలం. ఏ విషయమూ దాచుకోకుండా మాట్లాడుకుంటాం" అని తెలిపారు. పరస్పర నమ్మకం, స్పష్టతతో తమ దాంపత్యాన్ని ప్రత్యేకంగా మలుచుకుంటున్న ఈ జంట, ఆధునిక సంబంధాలకు కొత్త దారి చూపుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.




# త్రిష పోస్ట్‌తో మళ్లీ చర్చల్లో విజయ్

దక్షిణాది సినీ పరిశ్రమలో ఎప్పుడూ వార్తల్లో ఉండే త్రిష, దళపతి విజయ్‌ల అనుబంధం మరోసారి సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. గతంలో వీరిద్దరూ కలిసి కనిపించిన సందర్భాలు, వాటికి సంబంధించిన ఫోటోలు వైరల్ కావడంతో అనేక రకాల ప్రచారాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయాలపై ఇద్దరూ ఎప్పుడూ స్పందించలేదు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో త్రిష తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం తన వేలిపై సిరా గుర్తును చూపిస్తూ ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు ఓటింగ్‌పై అవగాహన కల్పించే పోస్టులు పెడతారు. కానీ త్రిష తన పోస్ట్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇప్పుడు ప్రత్యేక చర్చకు కారణమైంది. విజయ్‌తో కలిసి నటించిన 'గిల్లి' సినిమాలోని ప్రసిద్ధ ' తాన్ని ఆమె ఆ పోస్ట్‌కు ఉపయోగించడం అభిమానుల్లో ఆసక్తి రేపింది. ముఖ్యంగా ఆ పాట ఎంపిక వెనుక ఉన్న అర్థాలపై నెటిజన్లు విశ్లేషణలు చేస్తున్నారు. కొందరు దీన్ని విజయ్‌కు పరోక్ష మద్దతుగా భావిస్తుండగా, మరికొందరు ఇది కేవలం యాదృచ్ఛికమేనని అంటున్నారు. ఇప్పటికే వీరిద్దరి మధ్య అనుబంధంపై వస్తున్న వార్తలకు ఈ పోస్టు మరింత ఊతమిచ్చింది. విజయ్ రాజకీయాల్లో కీలకంగా అడుగులు వేస్తున్న సమయంలో త్రిష చేసిన ఈ చర్య సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె నేరుగా ఎలాంటి ప్రకటన



# స్టైల్ రూల్స్ మార్చేసిన మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ మరోసారి తన స్టైలిష్ లుక్స్‌తో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. భిన్నమైన అవుట్‌ఫిట్స్‌లో కనిపిస్తూ తన ఫ్యాషన్ వెర్సటిలిటీని చాటుకుంది. చాక్లెట్ బ్రౌన్ ఆఫ్‌షోల్డర్ రిబ్డ్ మిడీ డ్రెస్‌లో ఆమె క్లాసీగా మెరిసింది. భారీ గోల్డ్ ఇయర్‌రింగ్స్, స్లీక్ పోనీటైల్‌తో కలిసి ఆ లుక్‌కు రిచ్ ఫినిష్ ఇచ్చింది. మిర్రర్ సెల్ఫీలో కనిపించిన ఆమె ఫిట్ సిల్హౌట్ సోషల్ మీడియాలో వెంటనే ట్రెండ్ అయింది. ఇక మరో లుక్‌లో పూర్తిగా భిన్నమైన స్టైల్‌తో కనిపించింది. డెనిమ్ బ్లేజర్‌ను బ్లాక్ బ్రాలెట్‌తో జత చేసి, ట్రాపికల్ ప్రింట్ స్లిట్ స్కర్ట్, గోల్డ్ ప్లాట్‌ఫామ్ హీల్స్‌తో బోల్డ్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఈ కాంబినేషన్ ఆమెకు మరింత గ్లామర్ జోడించింది. ఇటీవల వచ్చిన 'రాజా సాబ్' సినిమా ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, మాళవిక మాత్రం తన జోరు తగ్గించడం లేదు. ప్రస్తుతం 'సర్దార్ 2', 'పాకెట్ నవెల్' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, ఫ్యాషన్ పరంగా కూడా ట్రెండ్ సెట్ చేస్తూనే ఉంది.



# కోర్సెట్ లుక్‌లో అదిరిపోయిన రాశి సింగ్

హీరోయిన్ రాశి సింగ్ తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బ్లష్ పింక్ స్ట్రాప్‌లెస్ కోర్సెట్ డ్రెస్‌లో ఆమె సాఫ్ట్ గ్లామ్ లుక్‌తో ఆకట్టుకుంది. క్లీన్ మిడీ సిల్హౌట్, స్ట్రక్చర్డ్ కోర్సెట్ డిజైన్ కలిసి ఈ లుక్‌ను మరింత స్టైలిష్‌గా మార్చాయి. ఈ ఫోటోల్లో ఆమె ప్రతి ఫ్రేమ్‌ను తన స్టైల్‌తో పూర్తిగా ఆక్రమించింది. ఒక ఫోటోలో డ్రీమీ, ఎలిగెంట్ లుక్‌లో కనిపిస్తే, మరో షాట్‌లో పూర్తి కాన్ఫిడెన్స్‌తో బోల్డ్ పోజ్ ఇచ్చింది. వేవీ హెయిర్, ఎక్స్‌ప్రెషన్స్‌తో రెండు విభిన్న వైబ్స్ చూపించినా, ప్రతి లుక్‌లోనూ ఆకర్షణ తగ్గలేదు. యాక్సెసరీస్ కూడా ఈ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లేయర్డ్ గోల్డ్ నెక్లెస్‌లు, చంకీ హూప్ ఇయర్‌రింగ్స్, గోల్డ్ బ్రేస్‌లెట్, న్యూడ్ స్లైడ్స్‌తో ఆమె స్టైలింగ్‌ను పూర్తిచేసింది. సింపుల్ పింక్ షేడ్‌కే కొత్త కాన్ఫిడెన్స్ ఇచ్చిన రాశి సింగ్, మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com